


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


ఈ విజయానికి మీరే స్ఫూర్తి




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 94 | శనివారం 04- 04 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


# మైక్రో ఇరిగేషన్‌లో ఏపీ నంబర్ వన్...

## అధికారులను అభినందించిన సీఎం చంద్రబాబు



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తూ నీటి పొదుపునకు పెద్దపీట వేస్తున్న ఆంధ్రప్రదేశ్, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) అమలులో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డు స్థాయిలో 1,26,057 హెక్టార్ల ఆయకట్టును సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకొచ్చి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఘనత సాధించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఉద్యానవన శాఖ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ తర్వాత 1.05 లక్షల హెక్టార్లతో గుజరాత్ రెండో స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. "ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసిన మీ కృషి అభినందనీయం" అని అధికారులను కొనియాడారు.

# తెలంగానలో ఏం చేశారని కేరళం ప్రచారం వెళ్లారు

## సిఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి విమర్శలు



కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి భాజపాపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీలకు మేం అన్యాయం చేశామని అంటున్నారు..

2లో

# యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

## ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగా వ్యవహరించలేదన్న ఆరోపణ



లయుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన

2లో

# రాఘువచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

2లో



- సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ
- ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా
- ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?
- వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా.

# అమరావతిపై వివాదాస్పద వ్యాఖ్య..



ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ బిల్లును ఆమోదించిన నేపథ్యంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అమరావతిపై 'కమరావతి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య దుమారం రేపగా, ఆ తర్వాత ఇచ్చిన వివరణలో ఆయన అధికార కూటమితో పాటు తాను వీడిన వైసీపీని కూడా లక్ష్యంగా చేసుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడంపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో "రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీకి ఒక సూచన. ప్రభుత్వం కట్టేది అమరావతే తప్ప, కమరావతి కాకుండా చూచుకోండి.. తస్మాత్ జాగ్రత్త" అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌లోని 'కమరావతి' పదంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.తన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో విజయసాయిరెడ్డి మరో ట్వీట్‌తో స్పందించారు. "నిన్నటి నా ట్వీట్‌లో అమరావతిని కమరావతి కానివ్వవద్దు అన్న సూచనను చూసి గంగవెర్రులెత్తిన వారంతా, కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలకు ఏమి బదులిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టమైన, స్థిరమైన విధానం లేదని, అదే సమయంలో టీడీపీకి ఇసుమంతైనా చిత్తశుద్ధి లేదని విమర్శించారు.



# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

## వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట

2లో

## అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

# పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం

## పార్టీ నాకు అప్పగించిన బాధ్యత ఇదే

## తమిళనాడు బిజెపి నేత అన్నామలై



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అన్నామలై స్పందించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల తరపున ప్రచారం చేయడమే తన పాత్ర అని, అది తన బాధ్యత అని చెప్పారు. కన్నూరులో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతానికి తమిళనాడులో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం కొనసాగించడమే తనకు అప్పగించిన బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం పుదుచ్చేరి, కేరళలో ఈనెల 7వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది. 7వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడులో బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులందరి తరపున ప్రచారంలో పాల్గొంటాను. పార్టీ అప్పగించిన బాధ్యత ఇది. దానికి పూర్తి న్యాయం చేస్తాను' అని అన్నామలై చెప్పారు. కన్నూరులో బీజేపీ అభ్యర్థి సి.రఘునాథ్ తరపున ఆయన ప్రస్తుతం ప్రచారం సాగిస్తున్నారు. ఎన్డీయే కూటమితో సంప్రదింపుల అనంతరం తమిళనాడులో పోటీ చేసే 27 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ శుక్రవారం విడుదల చేసింది.

2లో

# బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు బిజెపిలో రాముడి రాజకీయం

- ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్

2లో



తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు.

# బీజేపీతో పొత్తు పెట్టుకునే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదు:



బీజేపీతో జట్టు కట్టేవారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గపడిన విషయం తెలిసిందే.

2లో

# బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు బిజెపిలో రాముడి రాజకీయం

బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్టాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం

తమిళనాడు బీజేపీలో 'సింహం'గా పేరున్న కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటులేకపోవడం చర్చనీయాంశమైంది. అయితే అన్నామలై మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు. డీఎంకేపై విమర్శలు గుప్పించారు. బీజేపీ కార్యకర్తగా బీజేపీ, ఎన్డీయే అభ్యర్థుల విజయానికి పాటుపడతానని చెప్పారు. పార్టీ అభ్యర్థుల జాబితాను కూడా ఆయన తన ట్వీట్‌కు జతచేశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శు క్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# మైక్రో ఇరిగేషన్‌లో ఏపీ నంబర్ వన్...

ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న 1,08,143 మంది రైతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా నీటి ఆదాతో పాటు సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం రైతాంగానికి రూ. 1,030 కోట్ల మేర సబ్సిడీని అందించిందని వెల్లడించారు. టమాటా, ఆయిల్ పామ్, మిర్చి నుంచి పప్పు ధాన్యాల వరకు వైవిధ్యమైన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో సబ్సిడీ ప్రయోజనాలు అందేలా పారదర్శక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మరిన్ని వేల హెక్టార్లను సూక్ష్మ సేద్యం కిందకు తీసుకొచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# అమరావతిపై వివాదాస్పద వ్యాఖ్య..

అంతటితో ఆగకుండా తన మాజీ పార్టీ వైసీపీ ఎంపీల తీరును కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "సాక్షాత్తు మీ వైసీపీ పార్టీ అధ్యక్షుడి పైన రాజ్యసభలో ఒక కాంగ్రెస్ ఎంపీ అలా నోరు పారేసుకుంటుంటే వైసీపీ ఎంపీలకు చీమకుట్టినట్టైనా అనిపించలేదా? అడ్డుకోరా? ఖండించరా? మౌన ప్రేక్షకులైనారా?" అంటూ నిలదీశారు. 2024 ఎన్నికల తర్వాత విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగి వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించినప్పటికీ, ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఏపీ రాజకీయాలపై తరచూ స్పందిస్తూ, కీలక వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజా వ్యాఖ్యలతో ఆయన అధికార, ప్రతిపక్ష పార్టీలను ఏకకాలంలో లక్ష్యంగా చేసుకున్నారు.

## తెలంగానలో ఏం చేశారని కేరళం ప్రచారం వెళ్లారు

బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలుకుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగాణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు.

## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పోరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధంపై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నలుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చడ్డా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చడ్డాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చడ్డా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శు క్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

# మరో మూడు రోజులు పార్లమెంట్ 16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం

## మహిళా రిజర్వేషన్ ,ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లులపై చర్చ

మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన వసతులపై కలెక్టర్ దృష్టి

**ఎస్సీ, బీసీ హాస్టళ్ల పనితీరును మెరుగుపరచాలని ఆదేశం**

**విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సదుపాయాలు కల్పించాలి**

**హాస్టళ్లలో పారిశుధ్యం, త్రాగునీరు, ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ**

**జీరో వేస్ట్ లక్ష్యంతో హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణ బలోపేతం**

**సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి**

**హాస్టళ్లలో మెనూ అమలు, వసతులపై నిరంతర తనిఖీలు అవసరం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

– జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల పనితీరును మరింత మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలపై సంబంధిత సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ శాఖ పనితీరు తగిన స్థాయిలో ఉన్నప్పటికీ, బీసీ వెల్ఫేర్ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో మెనూ వివరాలతో పెద్ద హోర్డింగ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంక్షేమ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, హాస్టళ్లలో నివసిస్తున్న పేద విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆహార నాణ్యత, వార్డెన్ల పనితీరు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించిన సమీక్షలో కొన్ని హాస్టళ్లు అత్యల్ప సానుకూలత సాధించగా, మరికొన్ని హాస్టళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడైందన్నారు. మంచి పనితీరు కనబరిచిన హాస్టళ్లను అభినందిస్తూ, తక్కువ పనితీరు కనబరిచిన హాస్టళ్ల వార్డెన్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే, "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" లక్ష్యంతో ప్రతి హాస్టల్ మరియు ప్రభుత్వ సంస్థలో వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తడి చెత్తతో కంపోస్ట్ తయారీ, చెత్త వర్గీకరణ కోసం గ్రీన్, బ్లూ, రెడ్ బిన్‌ల ఏర్పాటు, పొడి చెత్త ద్వారా ఆదాయం సాధించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. హాస్టల్ ప్రాంగణాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని, త్రాగునీరు, పారిశుధ్యం, ఆహార నాణ్యత, వార్డెన్ అందుబాటు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో ఆర్.ఓ ప్లాంట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




## బీజేపీతో పొత్తు పెట్టుకునే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదు

తమిళనాడులో బీజేపీ, అన్నాడీఎంకే పార్టీలు పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కనిమొళి స్పందించారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే రాజకీయ పార్టీల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. డీఎంకే హిందూ వ్యతిరేక పార్టీ అంటూ బీజేపీ కూటమి చేస్తున్న ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. అన్నాడీఎంకే తీసుకున్న రాజకీయ నిర్ణయాలు తమిళనాడు, ఇక్కడి ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించాయని అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న తర్వాత ఏ రాజకీయ పార్టీ కూడా వృద్ధి సాధించినట్లు చరిత్రలో లేదని అన్నారు. బీజేపీ, అన్నాడీఎంకేది మోసపూరిత పొత్తు అని విమర్శించారు. బీజేపీతో పొత్తు ద్వారా అన్నాడీఎంకే తమిళ ప్రజలతో పాటు ఆ పార్టీ కార్యకర్తలను కూడా మోసం చేశారని విమర్శించారు.

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న కారు ఇద్దరు అక్కడిక్కడే మృతి

జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ –పెద్దపల్లి బైపాస్‌లో బొమ్మకల్ ఫ్లై ఓవవర్ వద్ద ఆగివున్న లారీని ఓ కారు పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో కారు ఒకవైపు భాగం మొత్తం నుజ్జునుజ్జ అయ్యింది. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు.. మృతులను సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఎండీ అదునాన్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఇక ఎండీ అబ్రార్ కారులో నుంచి దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య గారి అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగ పరమైన హక్కులను అందించగలిగిన నాడే, దొడ్డి కొమరయ్య వంటి ఎందరో తెలంగాణ అమరులు, త్యాగధనులకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో అమరావతి చట్టబద్ధతపై వేడుకలు





**మంత్రి ఫరూక్ కేక్ కట్ చేసి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు**

**అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకం: మంత్రి ఫరూక్**

**అమరావతి రాజధాని చట్ట బద్ధత పై హర్షం వ్యక్తం చేసిన ఐఎంఏ వైద్యులు**

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 3 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కి పార్లమెంటులో చట్టబద్ధత చేసిన సందర్భంగా శుక్రవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎమ్.డి. ఫరూక్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. మంత్రి ఫరూక్ వైద్యులతో కలిసి కేక్ కట్ చేశారు.ఐఎంఏ వైద్యులు మంత్రి ఫరూక్ ను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అనుకూలమైన ప్రదేశంలో అమరావతి మహా నగరాన్ని నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూనుకోవడం ఆయన దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ఐఎంఏ వైద్యులు అమరావతి రాజధాని విషయంలో మద్దతు పలుకుతూ హర్షం వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, బిజెపి నాయకులు డాక్టర్ ఇంటి ఆదినారాయణ, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ సునీత మాట్లాడుతూ ఏప్రిల్ 2 వ తేదీ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన చారిత్రాత్మక రోజుగా కలకాలం నిలిచిపోతుందని, ఆ దిశలో కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్ లకు,పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి, పార్లమెంటులో మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలన్నిటికీ వైద్యుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ ఇంటి ఆదినారాయణ, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ పనిల్ కుమార్, మహిళా వైద్య విభాగం ప్రతినిధులు డాక్టర్ సునీత, డాక్టర్ హరిత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత, డాక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్ల నియామకంలో సడలింపు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 3:** గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకంలో ప్రభుత్వం సడలింపులు విధించింది. పంచాయతీలకు మండల విద్యాశాఖ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ విషయంలో అధికారులు మార్పు చేసినట్లుగా తెలుస్తోంది. స్పెషల్ ఆఫీసర్లుగా మండల విద్యాశాఖ అధికారులను తొలగించినట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరు మండల పరిధిలోని సింగవరం సోమయాజులపల్లె గ్రామాలకు మండల విద్యాశాఖ అధికారి యశోదను నియమించారు. జిల్లా అధికారుల నుండి వచ్చిన ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారిని స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలను నుండి తప్పించి, రెండు గ్రామాలకు ఇతర శాఖలకు చెందిన అధికారులను ఇన్చార్జి స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నట్లుగా సమాచారం.

## యశ్వంత్ రెడ్డి వివాహ వేడుకలకు ఇవిచ్చేసి వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



**కలసపాడు ఏప్రిల్ 03 (నంది పత్రిక ):**కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోవిళ్ళ వెంకట రెడ్డి, శారద గార్ల ఏకైక పుత్రుడు యశ్వంత్ రెడ్డి వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విచ్చేసి కొత్త వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, జడ్పిటిసి గురివిరెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణరెడ్డి, ఓబుల్ రెడ్డి, రఘు రామి రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు చాపాటీ సాయి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం,మైనార్టీల సంక్షేమం,అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది.. ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు నంది పత్రిక...** రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు...రూరల్ మండలంలోని ఈ.తాంద్రపాడు గ్రామంలో మాజీ రాజ్య సభ సభ్యులు టీ.జీ. వెంకటేష్ సొంత నిధులు రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన మైనార్టీ షాధిఖానాను టీ.జీ వెంకటేష్ తో కలిసి ఆయన ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మైనారిటీల సామాజిక, ఆర్థిక మరియు విద్యాపరమైన ప్రగతి కోసం పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు... ఇక టీ.జీ కుటుంబం కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్న ఆయన, ఉమ్మడి కర్నూలు జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పడుతున్నాయని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు...అంతకు ముందు గ్రామంలో టీ.జి వెంకటేష్ తల్లి గౌరమ్మ జ్ఞపకార్థం ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని ఎంపీ నాగరాజు ప్రారంభించారు...ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలిపీరా, ఎం.పీ.టీ.సీ లు మాబుబాషా, వెంకటేశ్వర్లు, ముస్లిం పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు...



## దారి తప్పుతున్న బాల్యం

### చదువుకోవాల్సిన వయసులో నేరాల బాట..

### ఆత్మకూరులో ముగ్గురు విద్యార్థుల ఉదంతం





**ఆత్మకూరు, ఏప్రిల్ 3: (నంది పత్రిక)** చదువుకొని భావి భారత పౌరులుగా ఎదగాల్సిన చిన్నారులు పెడదారి పడుతున్నారు. పుస్తకాలు చేతబట్టాల్సిన వయసులో నేరాల వైపు అడుగులు వేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నంద్యాల జిల్లా, ఆత్మకూరులో ముగ్గురు పాఠశాల విద్యార్థులు చేసిన పని ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఏం జరిగిందంటే..** ఆత్మకూరు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో ముగ్గురు విద్యార్థులు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలు జనం రద్దీగా ఉండే ఆ మార్కెట్‌లోకి అర్ధరాత్రి సమయంలో ఎవరూ గమనించడం లేదనుకుని చొరబడ్డారు. అక్కడ అందిన కాడికి దోచుకున్న ఈ చిన్నారులు, తమ కదలికలు ఎక్కడ బయటపడతాయోననే భయంతో సీసీ కెమెరాలను ధ్వంసం చేసేందుకు కూడా ప్రయత్నించారు. అయితే, అప్పటికే కెమెరాలో వీరి కదలికలు స్పష్టంగా రికార్డయ్యాయి.

**ఆందోళనలో స్థానికులు** స్కూల్ యూనిఫాం ధరించి, అర్ధరాత్రి వేళ ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం చూస్తుంటే ఆందోళన కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వీరి వెనుక ఎవరైనా పెద్దల హస్తం ఉందా? లేక కేవలం సరదా కోసం చేస్తున్నారా? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులపైనే బాధ్యత..** పిల్లలు చిన్నతనంలోనే ఇలా దొంగతనాలకు అలవాటు పడటం సమాజానికి ప్రమాదకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరిపి, ఆ విద్యార్థులను గుర్తించి.. భవిష్యత్తులో మంచి మార్గంలో నడిచేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. చిన్నారి చేతుల్లో పుస్తకాలు ఉండాల్సిన చోట ఇలాంటి నేరాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని, పోలీసుల చర్య కోసం ఎదురుచూస్తున్నామని స్థానికులు పేర్కొన్నారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)"

### సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత....

**నంద్యాల క్రైం, ఏప్రిల్03(నంది పత్రిక):-** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ను శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది వారి యొక్క సమస్యల గురించి ఎస్పీకి తెలియచేసినారు. జిల్లా ఎస్పీ, సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు.ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ,పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియ చేసినారు.



## ఏప్రిల్ 17 నంద్యాల జిల్లాలో జరిగే. బుడగ జంగాల కుల ఎస్ సి పునరుద్దరన సభ.

### హాజరవుతున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ.




**బేతంచెర్ల ఏప్రిల్ 3 ( నంది పత్రిక ).** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో "బేడ బుడగ జంగం కుల ఎస్ సి. పునరుద్ధరణ సభ" కు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం బేతంచెర్ల లోని బేడ బుడగ జంగం కాలనీలో రిలీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో బేడ బుడగ జంగం కుల ప్రజలందరూ ఐక మత్యంతో,తమ రిజర్వేషన్ హక్కులకు జరుగుతున్న అన్యాయంపై,భవిష్యత్ కార్యాచరణ రూపొందించు కొనుటకు " ఏప్రిల్ 17న చలో నంద్యాల సభకు" కదలి రావాలని యావత్ బేడ బుడగ జంగం కుల ప్రజానీకానికి పిలుపు నిచ్చారు.అందుకుగాను బేతంచర్ల మండలం నుంచి బేడ బుడగ జంగం కులం వారు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయవలసినదిగా కోరుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం కులం వారు టి.బాల సుంకన్న,టి.శ్రీనివాసులు,బి. జమ్మన్న, టి.వంశీ,టీ.మద్దిలేటి,టి. రాజేష్,టి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ దంపతులకు సన్మానం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 3:** పంచాయతీ గ్రామ సర్పంచ్ పదవి కాలం ముగిసిన సందర్భంగా సర్పంచి దంపతులకు సన్మాన కార్యక్రమం జరిగింది. బండి ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న గాలి చెన్నయ్యపాలెం గ్రామ సర్పంచ్ కంచర్ల శోభారాణి, ఆమె భర్త ఉప సర్పంచ్ కంచర్ల లింగారెడ్డిని గ్రామస్తులు గురువారం రాత్రి పండుగ వాతావరణం లో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సభ్యులను సైతం సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఐదేళ్ల సర్పంచి పదవి కాలంలో సర్పంచ్ దంపతులిరువు రు గ్రామాభివృద్ధి విషయంలో ఎనలేని కృషి చేశారని గ్రామస్థులు వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా గ్రామంలో గతంలో పనిచేసిన కార్యదర్శులను సైతం గ్రామానికి రప్పించి వారిని కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం కూడా పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ దంపతులను వార్డు సభ్యులను గ్రామ పురవీధులలో ఊరేగించారు.



## దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులకు రోస్టర్ పెంచాలి. స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ.



**బేతంచెర్ల ఏప్రిల్ 3 ( నంది పత్రిక ).** దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ రిలీజ్ చేసిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు, బేతంచెర్ల స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్ధిలేటి, కార్యదర్శి బి.రాముడు ప్రత్యేక కృతజ్ఞత అభివందనములు తెలియ జేశారు. శుక్రవారం సంఘం కార్యాలయం నందు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి.రాష్ట్ర కూటమి ప్రభుత్వం దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు రోస్టర్ ఎక్కువగా పెంచాలి.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనములు మరియు మార్గ దర్శకాలు ఉన్నప్పటికీ,అనేక శాఖలలో ఖాళీలు ఉన్నాయి.దివ్యాంగుల కోసం కేటాయించిన బ్యాక్ లాగ్ పోస్టులకు సంభందించి,రోస్టర్ వెరిఫికేషన్లకు,ఇంకా చాలా డిపార్ట్ మెంట్లు రాలేదు.అందువల్ల సరైన విధానంలో భర్తీ చేయక పోవడం,పోస్టులు ఎక్కువగా విడుదల ఇవ్వడం లేక,చాలా మంది వేల సంఖ్యలో నిరుద్యోగులు శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ నిర్వహించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో శకుంతల, మద్దమ్మ,సురేష్,రామమోహన్, రామాంజనేయులు తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 3 ( నంది పత్రిక )** నంద్యాల.... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ గారి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రివర్యులు ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# దొంగతనాలకు పాల్పడిన ముద్దాయి అరెస్ట్ ..







## 15 లక్షలు విలువ గల బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ వెల్లడి..

**నంద్యాల క్రైం, ఏప్రిల్03(నంది పత్రిక):–** దొంగ తనాలే ఇతని వృత్తి ఉదయం లేస్తే చాలు.. ఏ ఇంటికి కన్నం వేద్దామా అనే ఆలోచన..పగటి పూట ఏ ఇళ్లు జనం లేకుండా తాళం వేసి ఉంటుంది.. దొంగతనాని అనుకూలంగా ఉంటుందా లేదా.. రెక్కి నిర్వహించడం.. ఎవ్వరు లేకుంటే ఆ ఇంటికి కన్నం వేయడమే అతగాడి పని.. ఇలా గత సంవత్సరం నుండి నంద్యాల చుట్టుప్రక్కల గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతూ.. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం పనిగా పెట్టుకున్న వ్యక్తి.. పోలీసులకు దొరుక కుండా తప్పించుకొని తిరుగుతూ నేరాలకు పాల్పడుతున్న బాబావలి అనే వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. దొంగ వద్ద నుండి సొమ్మును, నగదు ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ ఎస్పీ మందా జవాలితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ దొంగతనాలకు పాల్పడిన ముద్దాయి వివరాలను వెల్లడించారు.నంద్యాల మండలం వై ఎస్ ఆర్ నగర్ కు చెందిన ముద్దాయి షేక్ బాబా వలి గత ఏడాది నుండి నంద్యాల చుట్టుప్రక్కల పోలీస్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాలలోనూ, పట్టణంలోనూ పగటి పూట దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలుసుకున్న నంద్యాల తాలూకా పోలీసులు, సీసీ ఎస్ సిబ్బంది నేరస్తుడిపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 3 వ తేదీన శుక్రవారం నందమూరి నగర్ రోడ్ టి జంక్షన్ వద్ద పోలీసులు వెహికిల్ చెకింగ్ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేని పల్సర్ మోటార్ సైకిల్ పై వస్తు పోలీసులను చూసి మోటార్ సైకిల్ ను తిప్పుకొని పోవుటకు ప్రయత్నించగా అతనిని పట్టుకొని విచారించగా పలు విషయాలు బయట పడ్డాయాన్నారు. పగటి పూట దొంగతనాలు చేస్తూ వచ్చిన సొమ్ముతో జల్సాలు పాల్పడుతూ పోలీసులకు దొరుకాకుండా తప్పించుకొని తిరిగేవాన్నని ముద్దాయి తెలిపినట్లు ఎస్పీ వెల్లడించారు. ముద్దాయి నుండి 98 గ్రాముల బంగారు నగలను, 400 గ్రాముల వెండి వస్తువులను,రూ.54,500 నగదు,మొత్తం విలువ సుమారు 15 లక్షలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ సునీల్ షేరాన్ వివరించారు.ప్రజలు ఇళ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిలో సెలవులకు ఊర్లకు వెళ్ళేటప్పుడు లేక బయటకు వెళ్ళేటప్పుడు ఇళ్లకు గట్టిగా తాళాలు వేసుకొని వెళ్లాలని లేకపోతే ఒక్కరు ఇంటి వద్ద కాపలాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**కేసులో పురోగతి సాధించిన పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ సీసీ ఎస్ సిబ్బందికి నగదు బహుమతి** నిందితుని అరెస్ట్ లో కీలక పాత్ర పోషిశీచిన నంద్యాల తాలూకా ఇన్స్పెక్టర్ ఆర్.ఈశ్వరయ్య , సీసీస్ ఇన్స్పెక్టర్ పి .సురేష్ కుమార్ను ,నంద్యాల తాలూకా పీస్ సిబ్బంది, పీసీస్ బి .రవికుమార్, ఎం .గంగాధర్ సీసీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ , ఇబ్రహిం, పీసీస్ మలిక్ బాష, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, గంగారం కృష్ణమ నాయుడులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పురోగతి సాధించిన సీసీ ఎస్ సిబ్బందికి నగదు ను బహుమతిగా అందజేశారు.

# సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన వసతులపై కలెక్టర్ దృష్టి

## ఎస్సీ, బీసీ హాస్టళ్ల పనితీరును మెరుగుపరచాలని ఆదేశం
## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సదుపాయాలు కల్పించాలి
## హాస్టళ్లలో పారిశుధ్యం, త్రాగునీరు, ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ
## జీరో వేస్ట్ లక్ష్యంతో హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణ బలోపేతం
## సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి
## హాస్టళ్లలో మెనూ అమలు, వసతులపై నిరంతర తనిఖీలు అవసరం
## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్03(నంది పత్రిక):–** జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల పనితీరును మరింత మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలపై సంబంధిత సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ శాఖ పనితీరు తగిన స్థాయిలో ఉన్నప్పటికీ, బీసీ వెల్ఫేర్ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో మెనూ వివరాలతో పెద్ద హోర్డింగ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంక్షేమ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, హాస్టళ్లలో నివసిస్తున్న పేద విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆహార నాణ్యత, వార్డెన్ల పనితీరు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించిన సమీక్షలో కొన్ని హాస్టళ్లు అత్యల్ప సానుకూలత సాధించగా, మరికొన్ని హాస్టళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడైందన్నారు. మంచి పనితీరు కనబరిచిన హాస్టళ్లను అభినందిస్తూ, తక్కువ పనితీరు కనబరిచిన హాస్టళ్ల వార్డెన్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే, “జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్” లక్ష్యంతో ప్రతి హాస్టల్ మరియు ప్రభుత్వ సంస్థలో వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తడి చెత్తతో కంపోస్ట్ తయారీ, చెత్త వర్గీకరణ కోసం గ్రీన్, బ్లూ, రెడ్ బిన్‌ల ఏర్పాటు, పొడి చెత్త ద్వారా ఆదాయం సాధించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. హాస్టల్ ప్రాంగణాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని, త్రాగునీరు, పారిశుధ్యం, ఆహార నాణ్యత, వార్డెన్ అందుబాటు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో ఆర్.ఓ ప్లాంట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




# నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ భూములు టిడిపి కార్యాలయానికి కేటాయించడంపై భగ్గుమన్న వైసీపీ



## అధికార దాహానికి అడ్డూఅదుపు లేదా? టీడీపీ భూదాహంపై వైసీపీ ఫైర్. రైతుల నోళ్లు కొట్టి పార్టీ ఆఫీసులు కడతారా? - వైసీపీ నిలదీత భగ్గుమన్న నంద్యాల వైసీపీ: మార్కెట్ యార్డ్ భూముల్లో టీడీపీ ఆఫీసా? మండిపడుతున్న నేతలు.

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 3 ( నంది పత్రిక )** నంద్యాలలో రాజకీయ సెగ రాజుకుంది. రైతుల సంక్షేమం కోసం కేటాయించిన మార్కెట్ యార్డ్ భూములను టీడీపీ కార్యాలయానికి ధారాదత్తం చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూదాహానికి తెరలేపిందని వారు విమర్శిస్తున్నారు. నంద్యాల నూనెపల్లెలోని వ్యవసాయ మార్కెట్ యార్డు భూముల కేటాయింపు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. కోట్లాది రూపాయల విలువైన 2 ఎకరాల భూమిని టీడీపీ కార్యాలయం కోసం కేటాయించడంపై వైఎస్సార్సీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష టిడిపి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ.. రైతుల కోసం ఉన్న మార్కెట్ యార్డ్ భూమిని టిడిపి పార్టీ కార్యాలయానికి ఇవ్వడం దారుణమన్నారు. ఎకరాకు కేవలం ఏడాదికి 1,000 రూపాయలకే లీజుకు ఇవ్వడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని 33 ఏళ్ల పాటు అప్పనంగా అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. “నంద్యాలలో టీడీపీ నేతల భూదాహం ఏ స్థాయికి చేరిందంటే.. రైతులకు దక్కాల్సిన మార్కెట్ యార్డ్ స్థలాన్ని కూడా వదలడం లేదు. నూనెపల్లె మార్కెట్ యార్డ్ పరిధిలోని 2 ఎకరాల స్థలాన్ని టీడీపీ ఆఫీసు కోసం కేటాయించడం రైతులను వంచించడమే అన్నారు. ఎకరాకు వెయ్యి రూపాయల లీజు అంటే అది ప్రభుత్వ ఆస్తిని దోచిపెట్టడం కాదా అని సూటిగా ప్రశ్నించారు? దీనిపై మేము న్యాయపోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంపై రైతులు కూడా ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి జీవోలు జారీ చేయడంపై వైఎస్సార్సీపీ పోరాటం ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కూటమి సర్కార్‌పై శిల్పా ఫైర్ అయ్యారు. నంద్యాల అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శ చేశారు. శిల్పా కుటుంబంపై టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి తీవ్రంగా ఖండించారు. సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం వల్ల నష్టపోయేది పేదలేనని ఆయన హెచ్చరించారు. రెండేళ్లు గడిచినా నంద్యాల అభివృద్ధి శూన్యమని, కేవలం సాకులు చెపుతూ కాలం గడుపుతున్నారని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంలో తమపై వస్తున్న విమర్శలను శిల్పా రవి రెడ్డి తిప్పికొట్టారు. శిథిలావస్థలో ఉన్న కాంప్లెక్స్ లను నిబంధనల మేరకే లీజుకు తీసుకున్నామని, వాటిని తామే మరమతులు చేసుకున్నామని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి శిల్పా సహకార్ బ్యాంక్, మినరల్ వాటర్ ప్లాంట్లు, రైతు సమాఖ్య వంటి సేవా కార్యక్రమాలను ఆపాలని హుకుం జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలు నిలిపివేస్తే శిల్పా కుటుంబానికి వచ్చే నష్టం ఏమీ లేదని.. నష్టపోయేది పేద ప్రజలే అని గుర్తుంచుకోవాలన్నారు. నంద్యాల జిల్లాగా మారిన తర్వాత కొత్తగా ఒక్క భవనాన్ని కూడా నిర్మించలేదని శిల్పా విమర్శించారు. నేటికీ కలెక్టరేట్ =ూ=ూ భవనాల్లోనే కొనసాగుతోందని, వైసీపీ హయాంలో నిర్మించిన భవనాలే నేటికీ దిక్కని గుర్తు చేశారు. నందమూరి నగర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయలేదని, ఉర్దూ కళాశాల, టీటీడీ కళ్యాణ మండపం భవనాలు ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. బొగ్గులైన్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఇక అమరావతి నిర్మాణంపై జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకం కాదని, కేవలం నిర్మాణ ఖర్చుపైనే తమ ప్రశ్న అని స్పష్టం చేశారు. చదరపు అడుగుకు 12 వేల రూపాయల వ్యయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూనే.. వైసీపీ పథకాలకు పేర్లు మార్చి కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# ఏసు స్మరణే గుడ్ ఫ్రైడే



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 3 :** శుభ శుక్రవారం అనేది యేసుక్రీస్తు సిలువ వేయబడిన మరియు మరణించిన రోజున స్మరించుకునే పవిత్రమైన దినం. ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చే ఈ శుక్రవారం లో ప్రార్థనలను ఉపవాసాలను పాటిస్తారు. ఇది పాపాల నుండి విముక్తి కలిగించే రోజుగా పరిగణించబడుతుంది. ఏసుక్రీస్తు మానవాళి కోసం తన ప్రాణాలను శిలువపై అర్పించిన రోజు. ఈరోజు బాధను సూచించినప్పటికీ యేసు త్యాగం ద్వారా వచ్చిన రక్షణను గుర్తు చేసుకుంటారు. పొరుగు వారిని ప్రేమించాలని వారి తప్పులను క్షమించాలి అంటూ, ఏసుక్రీస్తు జీవించిన రోజులలో బోధనలు చేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు ఆరాధన యొక్క ప్రాముఖ్యత, క్రైస్తవ సోదరుల విశ్వాసంలో అత్యంత కీలకమైనది. దేవుని మహిమ పరచడం ఆరాధనతో సంబంధాన్ని పెంచుకోవడం ఆరాధన యొక్క ముఖ్య ఉద్దేశం. ఆరాధన అంటే కేవలం పాటలు పాడటమే కాదు, ఆత్మతో, సత్యముతో దేవుని ఆరాధించడం ముఖ్యం. ఆరాధన అనేది దయనిండిన జీవితంలో దేవునికి పూర్తి విధేయత చూపడం ద్వారా వ్యక్తం అవుతుంది. ఈ కోవలోనే బండి ఆత్మకూరు మండలంలోని లింగాపురం, పార్నపల్లె, ఏ కోడూరు, సంత జుటూరు, నారాయణపురం కడమల కాలువ, బండి ఆత్మకూరు గ్రామాలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు బోధనలను, గుడ్ ఫ్రైడే యొక్క ప్రాధాన్యతను గురించి వివరించారు.



# అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

**తెలియని వ్యక్తులకు డబ్బులు ఇవ్వోద్దు.**

**ఫోన్ పే, గూగుల్ పే వంటివి చేయించుకోవద్దు.**

**మోసాలు చేస్తారు... బ్యాంకు ఖాతా లు, ఫోన్ పే బ్లాక్ అవుతాయి**

**ఏటీఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలి!**

**కర్నూలు జిల్లా ప్రజలకు హెచ్చరిక జారీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్**



**కర్నూలు నందిపత్రిక** ఇటీవల ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచిత వ్యక్తులు అత్యవసరం ఉందని చెప్పి, డబ్బులు తీసుకొని ఫోన్ పే చేసినట్లు చూపించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని ముఖ్యంగా ఫోన్ పే ద్వారా డబ్బులు పంపుతాము” అంటూ మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ జిల్లా ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

**మోసం ఎలా జరుగుతోంది?** అపరిచితులు ముందుగా డబ్బులు తీసుకుంటారు తరువాత ఫోన్‌పే / ఇతర డిజిటల్ యాప్ ద్వారా డబ్బులు పంపినట్లు చూపిస్తారు. కానీ ఆ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ కావు లేదా “హోల్డ్”లో పడిపోతాయి. బాధితులు డబ్బులు కోల్పోవడంతో పాటు, వారి బ్యాంక్ ఖాతాలు / డిజిటల్ అకౌంట్లు బ్లాక్ అయ్యే ప్రమాదం ఉంటుంది.సైబర్ నేరగాళ్లు ఈ విధానంలో “మ్యూల్ అకౌంట్లు” ఉపయోగించి మోసాలు చేస్తున్నారు. ప్రజలు తప్పక పాటించాల్సిన జాగ్రత్తలు:ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితుల సహాయం తీసుకోవద్దు తెలియని వ్యక్తులతో డిజిటల్ లావాదేవీలు చేయవద్దు. “అత్యవసరం” అంటూ నమ్మించే వ్యక్తులను నమ్మవద్దు. మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ లు ఎవరికీ ఇవ్వొద్దు. అనుమానాస్పద వ్యక్తులను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సైబర్ మోసం జరిగితే వెంటనే: 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబర్ క్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ – లో ఫిర్యాదు నమోదు చేయండి ఒక గంటలోపు ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది కర్నూలు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి



**చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక) ఏప్రిల్ 3** కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ పరిధిలో గల అడవి గ్రామంలో అమరావతి రాజధానిని కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంతో గ్రామస్తులు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. చెక్కునత్తం మణి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమరావతిపై చట్టబద్ధత కల్పించడం సంతోషకరమన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధాని ఏర్పాటు చేసి కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ వినోద్, అడవి ములకలపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ మహోత్సవం



**మర్రిపాడు ఏప్రిల్ 03నంది పత్రిక :** చిలకపాడు ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి,చిలకపాడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి ల దాతృత్వంతో నిర్మించబడిన సరస్వతి దేవి మందిరం మరియు సాంస్కృతిక కళావేదిక ప్రారంభోత్సవ మహోత్సవాన్ని ఎంతో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మారుతి కేశవకుమార్ రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం సిద్ధంరెడ్డి రామా మోహన్ రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాంధీ జన సంఘం ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మదు నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన మరియు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కంపసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి,పొంగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు,పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## ఈడిగ తిరుమలేష్ గౌడ్ కుమార్తె ముహూర్త వేడుకకు హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన టిడిపి కుటుంబ సభ్యులు ఈడిగా తిరుమలేష్ గౌడ్ కుమార్తె ముహూర్త వేడుక ఘనంగా జరిగింది. తిరుమలేష్ గౌడ్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ గౌరవనీయులు శ్రీ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు వారి సోదరుడు కుమారుడు శ్రీ కాటంరెడ్డి శివప్రసాద్ రెడ్డి, శ్రీ కాటంరెడ్డి అన్వేష్ కుమార్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెళ్లికూతురిని ఆశీర్వదించి, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తిరుమలేష్ గౌడ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ముహూర్త విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోయలకుంట్ల గ్రామ టిడిపి కార్యకర్తలు పలువురు పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు.

# మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్



**తిరుపతిబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 3నంది పత్రిక** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అమలు చేయబడుతున్న "మన ఊరు మన జెండా" కార్యక్రమం గ్రామస్థాయి నుండి పార్టీని బలపరచడం మరియు ప్రజలతో నేరుగా అనుసంధానం పెంపొందించడం అనే రెండు లక్ష్యాలతో రూపదిద్దుకుంది. ఈ కార్యక్రమం కేవలం జెండా ఎగరవేసే కార్యక్రమం మాత్రమే కాకుండా, గ్రామ గ్రామస్థాయిలో పార్టీని సంస్థాగత బలాన్ని పెంచే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికగా భావించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ భారతీయ జనతా జనతా పార్టీ జెండా ఎగురవేయాలని ఏప్రిల్ ఆరవ తేదీన జిల్లా వ్యాప్తంగా సుమారు 100జండాలను ఎగురువేసే విదంగా పార్టీ ప్రణాళిక చేస్తున్నదని సామంచి శ్రీనివాస్ తెలిపారు. మన ఊరు మన జెండా కార్యక్రమం వినూత్నంగా ఉంటుందని ఈ కార్యక్రమం ఆరు నెలలు పాటు ఉంటుందని చెప్పారు ఏప్రిల్ 6వ తేదీ తిరుపతి అసెంబ్లీ పరిధిలో సుమారుగా 30 చోట్ల ఒకే సమయంలో జెండా ఎగరేసే విధంగా ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బి డీ బాలాజీ, డా నరేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంతి రాజు మరియు మల్ల కుప్పం శేఖర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్, తిరుపతి అసెంబ్లీ మండల అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివాజీ, పూలే, అంబేద్కర్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేద్దాం



**కర్నూలు నంది పత్రిక...** నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, హక్కుల కోసం వారి జీవితాన్నే ధారపోసిన మహనీయులు చత్రపతి శివాజీ, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్ బాబు నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి,డా. కంచర్ల హరిప్రసాద్ బిఏఎంసిఇఎఫ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్, ఆర్టిఐ జయన్న లు పిలుపునిచ్చారు .శుక్రవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జయంతి వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 ఏప్రిల్ 8వ తేదీ నుండి 14 వ తేదీ వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ మహాత్మ జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిలను పురస్కరించుకొని ఏప్రిల్ 8వ తేదీన శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం నుండి డ్రైవర్స్ అసోసియేషన్ హాల్ వరకు ర్యాలీ అనంతరం సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్ పాల్గొంటున్నారని ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 6:00కి టీజీవి కళాక్షేత్రంలో సి క్యాంపు నందు పూలే సినిమాప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, ఏప్రిల్ 14 న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ నుండి యునాని హాస్పిటల్ వరకు ర్యాలీ అనంతరం సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజాసంఘాల నాయకులు మేధావులు ఆ మహనీయుల చరిత్ర తెలుసుకొని భవిష్యత్తు తరాలకు వారి చరిత్రను అందించే విధంగా ప్రతి ఒక్కరు చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి సి మహేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజనేయులు నాగరాజు కర్నూలు జిల్లా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు

# టిడిపి కో క్లస్టర్ ఇంచార్జ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న మండల కో క్లస్టర్ ఇంచార్జెస్.



**నందికొట్కూరు ఏప్రిల్ 3( నంది పత్రిక )** టిడిపి మంగళగిరి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కో క్లస్టర్ ఇంచార్జి ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో నందికొట్కూరు నియోజవర్గ పరిధిలోని నందికొట్కూర్ మండల కో క్లస్టర్ ఇంచార్జ్ బొగ్గు రాజశేఖర్, పగిడాల మండల కో క్లస్టర్ ఇంచార్జ్ మద్దిలేటి గౌడ్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా పగిడాల మండల కో క్లస్టర్ఇంచార్జ్ మద్దిలేటి గౌడ్ లక్ష్మాపురం గ్రామ సమస్యలపై, పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారం కొరకు ,అభివృద్ధి కృషి చేస్తానని భరోసా ఇవ్వడం జరిగిందని, సీఎం చంద్రబాబు తన పక్కనే కూర్చుని ట్రైనింగ్ క్లాసుల్లో పాల్గొనడం, ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం సహకరిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# జర్నలిస్టుపై కత్తితో దాడి దుర్మార్గం

### గుజ్జుల గౌరీశ్వర నాయుడు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్మీకి బోయ సంఘం.



**నందికొట్కూరు ఏప్రిల్ 3( నంది పత్రిక)** గత నాలుగు రోజుల క్రితం కత్తితో దాడి ఘటనలో తీవ్ర గాయాలయి కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న కందనవోలు విలేఖరి స్వామన్న ను శుక్రవారం వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, విలేఖరి ఆరోగ్య పరిస్థితిని స్వయానా అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలి అని, ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని, కుటుంబ సభ్యులను ఓదార్చు తూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని, దాడికి పాల్పడిన నిందితుని పోలీస్ యంత్రాంగం కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

**కొత్తపల్లి – నంది పత్రిక:** ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని మూడురోజుల ముందు శుక్రవారం రోజున క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో గుడ్డేను జరుపుకొన్నారు. ఈ రోజున యేసుక్రీస్తును రోమన్ సామ్రాజ్యం ఎన్నో చిత్రహింసలు చేసి చివరికి శిలువవేయడం ఆయన మరణనించడం జరుగుతుంది. ఈ సమయంలో యేసుక్రీస్తూ శిలువలో పలికిన ఏడుమాటలను గుర్తుచేసుకుంటూ క్రైస్తవులు భక్తితో చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కొత్తపల్లి సిఎస్ఐ సంఘ ప్రోస్ట్రేట్ చైర్మర్ భరత్ దివాకర్ బాబు, దుద్యాల సీఎస్ ఐ సంఘ పాస్ట్రేట్ చైర్మన్ రవికుమార్, ఆర్సీఎం సంఘం బోధకుడు జయన్నలు ఏసుక్రీస్తూ చూపిన శాంతి మార్గంలో అందరు నడవాలని వాఖ్యబోధన చేశారు. ప్రతి ఒక్కరు భక్తిభావనను అలవరచుకోవాలని చెప్పారు.

# రాచర్ల వాసి 'సివిల్ జడ్జి'గా ఎంపిక



**నందిపత్రిక –ప్యాపిలి** మండల పరిధిలోని రాచర్ల గ్రామానికి చెందిన తటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ గా ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఆయన ఈ ఘనత సాధించారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం శ్రీపురంలోని ప్రియ సిమెంట్ హైస్కూల్‌లో సాగింది. హైదరాబాద్‌లోని విజేత జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆయన, పంజాబ్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీలో బి.ఏ.ఎల్.ఎల్.బి (ఆనర్స్) పట్టా పొందారు. తల్లిదండ్రులు టి. రామచంద్రారెడ్డి, టి. విజయలక్ష్మిల ప్రోత్సాహంతో పాటు, కర్నూలుకు చెందిన ప్రముఖ న్యాయవాది బి.కంబిరెడ్డి స్ఫూర్తితో తాను ఈ స్థాయికి చేరుకున్నట్లు కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మారుమూల గ్రామం నుంచి పట్టుదలతో చదివి జడ్జిగా ఎంపికైన కిరణ్ కుమార్ రెడ్డిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

# షరతులు లేని ప్రేమ ఆయనది

### గుడ్ ఫ్రైడే సందర్భంగా దైవసందేశమందించిన కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ - భక్తిశ్రద్ధలతో ప్రేమగిరికి సాగిన శిలువయాత్ర.. - రక్తి కట్టించిన క్రీస్తు శిలువపాటుల స్మరణ వేషధారణ



**కర్నూలు నంది పత్రిక.....** షరతులు లేని ప్రేమ, ఎల్లలెరుగని త్యాగం క్రీస్తు యేసుది అని కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ తెలిపారు. పవిత్ర శుక్రవారం(గుడ్ ఫ్రైడే) సందర్భంగా ఆయన శిలువను మోసి ప్రేమగిరికి శిలువయాత్రను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం చిల్డ్రన్స్ పార్క్ దగ్గర గల పునీత పెద్ద థెరేసమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన శిలువయాత్ర లూర్ధుమాత కథిడ్రల్ (బిషప్ చర్చి) చేరుకుంది. బిషప్ చర్చిలో బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ శిలువను మోసి ప్రేమగిరికి శిలువయాత్రను కొనసాగించారు. కులమతాలకతీతంగా నగర పౌరులు ఈ శిలువయాత్రలో పాల్గొన్నారు. నగర శివారులోని ప్రేమగిరికి చేరుకున్న అనంతరం బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ క్రీస్తుయేసు శిలువయాత్రలో అనుభవించిన 14ముఖ్య ఘట్టాలను గుర్తు చేస్తూ సంప్రదాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రేమగిరి కొండపై చర్చిలో దైవ సందేశమందిస్తూ క్రీస్తును ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలన్నారు. శత్రువును సైతం ప్రేమించగలిగాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రేమతో జయించాలని కోరారు. అంతకు మునుపు బిషప్ చర్చి ఆవరణలో పాస్టర్ సువర్ణరాజు బృందం నిర్వహించిన క్రీస్తు శిలువ పాటుల స్మరణ వేషధారణ అందరినీ అలరించింది. కార్యక్రమంలో కర్నూలు డయాసిస్ డీన్ ఫాదర్ జాన్ డేవిడ్, ఫాదర్లు జోజిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, చిన్నపరెడ్డి, తోట జోసఫ్, సిస్టర్లు, నగర పౌరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య బహుజన పోరాటానికి ప్రతీక

### కురుమలకు రాజకీయ న్యాయం చేయాలి: డా. జె. పూర్ణచంద్రరావు



**హైదరాబాద్,నంది పత్రిక....** దొడ్డి కొమురయ్య బహుజనుల హక్కుల కోసం పోరాడిన తొలి తెలంగాణ సాయుధ పోరాట యోధుడని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) జాతీయ సమన్వయ కర్త, రిటైర్డ్ జడ్జి డాక్టర్ జె. పూర్ణచంద్రరావు గారు పేర్కొన్నారు. 1946లో భూస్వాములు, వారి కిరాయి సైనికులైన రజాకార్ల చేతిలో కొమురయ్య ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. కురుమ సామాజిక వర్గానికి చెందిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో బహుజనులకు జరుగుతున్న అన్యాయాలకు ఎదురు నిలిచిన ధైర్యవంతుడని కొనియాడారు. అప్పటి జాగిర్దార్‌లు, దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యంలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, అధిక పన్నులు, భూ దోపిడీలు సామాన్య ప్రజల జీవనాన్ని కష్టతరం చేశాయని పేర్కొన్నారు. గ్రామ పాలన మొత్తం వారి చేతుల్లో ఉండి, ప్రజలపై అన్యాయం కొనసాగిందన్నారు. ఇలాంటి పరిస్థితులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమైందని, అందులో దొడ్డి కొమురయ్య తొలి అమరుడిగా నిలిచారని చెప్పారు. ఇదే సమయంలో సర్వాయి పాపన్న గౌడ్, శివాజీ మహారాజ్ వంటి మహనీయులు కూడా అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారని వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో కురుమ సామాజిక వర్గం జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కేవలం కొద్దిమంది మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం సామాజిక అసమానతకు నిదర్శనమన్నారు. బహుజన వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని డాక్టర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు , అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణల పై ప్రత్యేక చర్యలు...

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు...

**కర్నూలు నంది పత్రిక.....** శుక్రవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసులు మరియు మునిసిపల్ కార్పోరేషన్ వారు సంయుక్తంగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద వాహనదారులు మరియు పాదచారులకు కలుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు కర్నూలు ట్రాఫిక్ సిఐ శ్రీ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారులను ఆక్రమించిన తోపుడు బండ్లు, అనధికారిక పార్కింగ్‌లు మరియు ఇతర అడ్డంకులను తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రహదారులపై వాహనాలను అడ్డంగా నిలపకుండా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



# “నైబర్‌హుడ్ వర్క్‌స్పేసెస్” విధానం అమలు

### రిమోట్ వర్క్‌కు ప్రోత్సాహం
### పెట్టుబడుల ఆకర్షణకు అడుగులు
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ 3నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఐటీ రంగాభివృద్ధికి మరింత ఊతమిస్తూ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ & గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ (జీసీసీ) పాలసీ 4.0 .. 20242029 లో భాగంగా “నైబర్‌హుడ్ వర్క్‌స్పేసెస్” అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ఫ్లెక్సిబుల్ మరియు డిస్ట్రిబ్యూటెడ్ వర్క్ మోడల్స్ నేపథ్యంలో, వ్యక్తిగత ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు మరియు చిన్న వ్యాపారాలు వృత్తిపరమైన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా ఫర్నిచర్, ఐటీ పరికరాలు, హై-స్పీడ్ ఇంటర్నెట్ వంటి మౌలిక వసతుల కొరతతో పాటు, అధిక వ్యయభారం వారికి ఇబ్బందులను కలిగిస్తున్నదని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం “నైబర్‌హుడ్ వర్క్‌స్పేసెస్” విధానాన్ని రూపొందించింది. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఉమ్మడి, వృత్తిపరంగా నిర్వహించబడే కార్యాలయ మౌలిక వసతులు అందించబడతాయి. హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రత్యేక డెస్క్‌లు, సమావేశ గదులు వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదనంగా, ఈ కేంద్రాలలో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, డిజిటల్ వనరులు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలు కూడా అందించబడతాయి. దీంతో రిమోట్ వర్కర్లు, ఫ్రీలాన్సర్లు, స్టార్టప్‌లు మరియు చిన్న సంస్థలకు మరింత మద్దతు లభించి, సహకారం, నెట్‌వర్కింగ్ మరియు నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన అనంతరం “ఆంధ్రప్రదేశ్ నైబర్‌హుడ్ వర్క్‌స్పేసెస్ పాలసీ 20252030”కు ఆమోదం తెలిపినది. ఈ విధానం అమలు తేదీ నుండి 5 సంవత్సరాలపాటు లేదా తదుపరి విధానం ప్రకటించే వరకు అమల్లో ఉంటుంది. ఈ విధానంలో పేర్కొన్న ప్రోత్సాహకాలు, తరువాత జారీ చేయబడే కార్యాచరణ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన పెట్టుబడిదారులకు వర్తింపజేయబడతాయి. ఆంధ్రప్రదేశ్ నెంబర్‌హుడ్ వర్క్ స్పేస్ పాలసీ 202530 కింద, రిమోట్‌గా పనిచేసే పారిశ్రామికవేత్తలు, వ్యక్తిగత నిపుణులు, ఫ్రీలాన్సర్లు మరియు సూక్ష్మ సంస్థలకు వర్క్‌స్పేస్ సౌకర్యాల కల్పన నిమిత్తం, వర్క్ స్పేస్ లను లీజుకు ఇవ్వదలచిన వారు ఆంధ్రప్రదేశ్ నెంబర్‌హుడ్ వర్క్ స్పేస్ పాలసీ 202530 కింద, రిమోట్‌గా పనిచేసే పారిశ్రామికవేత్తలు, వ్యక్తిగత నిపుణులు, ఫ్రీలాన్సర్లు మరియు సూక్ష్మ సంస్థలకు వర్క్‌స్పేస్ సౌకర్యాల కల్పన నిమిత్తం, వర్క్ స్పేస్ లను లీజుకు ఇవ్వదలచిన డెవలపర్ల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు



ఆహ్వానించబడుతున్నవి.

**వివరాలు & దరఖాస్తు కోసం:** వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల మరియు ఐటీ రంగ విస్తరణకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మరిన్ని వివరాలు కొరకు జిల్లా ఐటీ మేనేజర్ 7207702737 సెల్ నెంబరు నందు సంప్రదించాలి.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్.





**రుద్రవరం న్యూస్.** నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు దారుణంగా దెబ్బతిన్నాయని, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రహమాన్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఆ సమయంలో డాక్టర్ విధుల్లో లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. కేవలం ఒక ఆయా మరియు నర్సు మాత్రమే అందుబాటులో ఉన్నారని, రోజుకు సుమారు 70 మంది రోగులు వస్తున్నా డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రావణి నెలకు కేవలం ఐదారు రోజులు మాత్రమే ఆస్పత్రికి వస్తూ, రిజిస్టర్లలో మాత్రం ఒకేసారి సంతకాలు చేస్తున్నారని, బయోమెట్రిక్ హాజరు యంత్రాన్ని తన నియంత్రణలో ఉంచుకుని ఇంటి నుంచే హాజరు వేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 24/7 అందుబాటులో ఉండాల్సిన ఇద్దరు డాక్టర్లు విధులకు గైర్హాజరు కావడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తామని అబ్దుల్ రహమాన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి భారీ వేతనాలు తీసుకుంటూ విధులను నిర్లక్ష్యం చేస్తున్న సదరు వైద్యురాలిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని రుద్రవరం మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లి స్వయంగా సిలువ మోసి క్రీస్తును స్మరిస్తూ, ఆయన చూపిన సేవ సన్మార్గాన్ని అందరూ పాటించాలన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్





**పెదవేగిబ్యూరో చీఫ్ , ఏప్రిల్3:నంది పత్రిక** మానవాళి పాప విముక్తి కోసం ప్రభువైన యేసుక్రీస్తు చేసిన త్యాగం అనన్య సామాన్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా పెదవేగి మండలం విజయిరాయ్ గ్రామంలో ఫాదర్ దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలు మరియు సిలువ యాత్ర (ర్యాలీ)లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**సిలువ మోసిన ఎమ్మెల్యే చింతమనేనిలి:**భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ సిలువ యాత్రలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా సిలువను తన భుజాలపై మోసి, క్రీస్తు పడిన శ్రమలను స్మరిస్తూ భక్తులతో కలిసి నడిచారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, సేవ అనే మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. శాంతియుత సహజీవనం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలందరి సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.... వేసవి ఎండల దృష్ట్యా, ప్రార్థనలకు హాజరైన విశ్వాసులకు మరియు ప్రజలకు ఆయన స్వయంగా శీతల పానీయాలను పంపిణీ చేశారు. అలాగే అక్కడి చిన్నారులకు ఐస్‌క్రీమ్‌లు అందించి వారితో సరదాగా సమయం గడిపారు. అనంతరం విజయరాయి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ దివాకర్ తో పాటు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బోప్పన సుధా, క్లస్టర్ ఇంచార్జ్ మంచినేని శ్రీనివాస్ సహా పలువురు స్థానిక కూటమి నేతలు, క్రైస్తవ విశ్వాసులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# బీసీల రిజర్వేషన్లపై అధ్యయనం: డెడికేటెడ్ కమిషన్‌కు వినతులు ఆహ్వానం

**భీమవరంబ్యూరో చీఫ్ : ఏప్రిల్ 3,నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లపై సమగ్ర అధ్యయనం కోసం పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి సూరిబాబు తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ నిబంధనల ప్రకారం, రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అనుభవాధారిత పరిశీలన నిర్వహించి, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించనుంది. ఈ నేపథ్యంలో, సంబంధిత అంశాలపై అవగాహన కలిగిన వ్యక్తులు తమ అభిప్రాయాలు, ఆధారాలతో కూడిన మెమోరాండాలు వినతిపత్రాలను ఏప్రిల్ 30, 2026 లోపు సమర్పించాలని కోరారు. వినతిపత్రాలు స్పష్టమైన వాస్తవాలతో, ధృవీకరించిన ఆధారాలతో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దిష్ట గడువులో, నిర్దేశిత విధానంలో అందని వినతులు పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. వినతిపత్రాలను విజయవాడ మొఘల్రాజపురంలోని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఉన్న డెడికేటెడ్ కమిషన్ కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా ఖజూఎ౩నవసఱఎఖ్‌వసఎశీఎఎఱంంఱశీఅ2026ఏస్త్రఝఱశ్రీ.ఎశీఎ ఇమెయిల్‌కు పంపవచ్చని తెలిపారు. అవసరమైతే ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకుని కార్యాలయంలో వ్యక్తిగతంగా కూడా సమర్పించవచ్చన్నారు.

# దెందులూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్ష

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈఓ జగదాంబ
### ప్రజల నుంచి వినతులు స్వీకరించి, తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశం



**పెదవేగి,బ్యూరో చీఫ్ ఏప్రిల్03నంది పత్రిక** దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఉదయం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జగదాంబ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ నిధుల ద్వారా దెందులూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సీఈఓ మరియు ఇతర అధికారులతో చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు ఎమ్మెల్యే గారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసారు. పలువురు నేతలు, అభిమానులు తమ ప్రాంతాల్లో జరగబోయే కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కి అందజేశారు.అదేవిధంగా, నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వినతులు స్వీకరించారు. స్థానిక సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని ఎమ్మెల్యే చింతమనేని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ని మర్యాద పూర్వకంగా కలసిన ,జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ



**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రియల్ 3:నంది పత్రిక** ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామంలో శుక్రవారం మీ భూమి - మీ హక్కు, పలు కార్యక్రమాలకు పాల్గొనుటకు వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ని మర్యాద పూర్వకంగా కలసి జిల్లా పరిషత్తు సిఇవో, నూజివీడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.జగదాంబ పూలమొక్కను అందజేసారు. అనంతరం మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విలాసారం సంధ్యారాణికి పిత్రు వియోగం.

**మహబూబాబాద్, ఏప్రిల్ 03(నంది పత్రిక):**నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్ అండ్ వుమెన్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షురాలు అయిన విలాసారం సంధ్యారాణి నాన్న శుక్రవారం పరమపదించారు. ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ మహమ్మద్ మొయినుద్దీన్, జాతీయ కోశాధికారి



వి.త్రివిక్రమ్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి సంపత్, తెలంగాణ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు బుర్ర కళ్యాణి, హనుమకొండ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు అమరావతి, భూపాలపల్లి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సరిత శ్రద్ధాంజలి ఘటించారు.

# ఎమ్మెల్యే కార్యాలయంలో పాలీసెట్ వాల్ పోస్టర్లు విడుదల



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 3 ( నంది పత్రిక** ఆళ్లగడ్డలో విద్యా సంవత్సరం తొలిసారిగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా కేంద్రాల సంబంధించిన ప్రభుత్వ అనుమతులు మంజూరు అయ్యాయి. ఎందుకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్యే భూమా కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పిఏలు రామ్మోహన్ ప్రసాద్ ఎంట్రన్స్ పరీక్షలు కోఆర్డినేటర్ రాజేష్ కోచింగ్ సెంటర్ సూపర్వైజర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డలో మొట్టమొదటిసారిగా పాలిటెక్నికల్ ఎంట్రన్స్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని విద్యార్థిని విద్యార్థులు పరీక్షల కోసం సూదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆళ్లగడ్డ లోని పాలిటెక్నికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ను నిర్వహించాలని పట్టుదలతో బోర్డ్ ఆఫ్ పాలిటెక్నికల్ ఎంట్రెన్స్ వారితో మాట్లాడి ఆళ్లగడ్డకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కేంద్రాలను తీసుకురావడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.

# అజరామం అమరావతి

**ఆళ్లగడ్డ ప్రతినిధిఏప్రిల్ 3 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్కు శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆమోదం లభించడంతో స్పందించిన ఆళ్లగడ్డ కు చెందిన ప్రముఖ చిత్రకారుడు భారత మాత తెలుగు తల్లికి అమరావతి అనే మకుటాని ధరింపచేస్తున్నట్లుగా ఓ చిత్రాన్ని చిత్రించారు వేగవంతం కావగలవన్న ఆశాభావాన్ని చిత్రకారుడు విజయ్ వ్యక్తపరిచారు.





# మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతుల ఇబ్బందులు.

### కౌంటర్లు పెంచాలని సిపిఎం మండల కార్యదర్శి గొడిషాల వెంకన్న డిమాండ్

**కేసముద్రం, ఏప్రిల్ 03(నంది పత్రిక):** మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ధన్నసరి సొసైటీ ద్వారా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో ఒకే ఒక్క కౌంటర్ ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న ఆరోపించారు. శుక్రవారం కేసముద్రం మార్కెట్ లోని రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద మాట్లాడుతూ, మొక్కజొన్న విక్రయానికి రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, కాంటా అయిన తర్వాత వివరాలు నమోదు చేయించడం వంటి అన్ని ప్రక్రియలకు ఒకే కౌంటర్ ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. ఆరుగాలం చేన్లలో కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులను ఇక్కడ కూడా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. అలాగే మొక్కజొన్న కొనుగోళ్లలో ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీసం ఎకరానికి 40 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు క్వింటాకు రూ.330 బోనస్ ఇవ్వాలని కోరారు. కొనుగోలు కేంద్రంలో కనీసం మూడు నుంచి నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుల రద్దీ తగ్గించాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసి సమయాన్ని ఆదా చేయాలని సూచించారు. రైతులు ఎక్కువసేపు నిలబడకుండా టోకెన్ విధానం అమలు చేయాలని తెలిపారు. మార్కెట్ యార్డులో తాగునీరు, నీడ, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతుల పంటను తక్షణమే తూకం వేసి ఆలస్యం లేకుండా చెల్లింపులు చేయాలన్నారు. అధికారులు రైతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహాత్మా గాంధీ పేరు తీసేస్తే సహించం.

### నరేగాపై దాడి ఆపాలంటూ సంతకాల సేకరణ.



**కేసముద్రం, ఏప్రిల్ 03(నంది పత్రిక):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరు మార్చి విబి జి రాంజీ గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ అ సంఘటిత కార్మికుల(కెకెసి) కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు, అసంఘటిత కార్మికుల కమిటీ జాతీయ చైర్మన్ ఉదిత్ రాజ్, తెలంగాణ చైర్మన్ కౌశల్ సమీర్ సూచనల మేరకు నరేగా బచావో విబిబిజిబిరాంబిజీ హఠావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలో కెకెసి రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.రాజశేఖర్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీల హక్కులపై దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. కూలీల పొట్టకొట్టి కాంట్రాక్టర్లకు లాభాలు ఇవ్వడం అమానుషమని, నరేగాను బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకుంటామని తెలిపారు. గాంధీ పేరు తీసేయడం దేశ చరిత్రను అవమానించడమేనన్నారు. పేదల హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెకెసి మైనార్టీ రాష్ట్ర నాయకులు మున్న జానీ, జిలాని, కేసముద్రం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ ఖాన్, కల్వల గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, స్థానిక నాయకులు గండి శ్రీనివాస్, ఆకుల సుధాకర్, జయిందర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, శేఖర్ రెడ్డి, బొడ్డు బిక్షం, ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# దళితుడి పై దాడి చేసిన అయ్యన్న పాత్రుడి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

### కోయిలకుంట్ల లో అయ్యన్న పాత్రుడి డిష్టిబొమ్మ దగ్ధం



**కోయిలకుంట్ల ఏప్రిల్ 3నందిపత్రిక** డప్పు వాయిస్తున్న దళితుడు భాస్కర్ రావు ను కులం పేరుతో దూసిస్తూ దాడి చేసిన ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడిని వెంటనే అరెస్టు చేసి ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలని వైసీపీ దళిత విభాగం కార్యదర్శి దండు మధు బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్ల లొని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన్నపాత్రుడి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం లో దళితులపైన దాడులు ఆగడం లేదు,.. అయ్యన్నపాత్రుడు వెంటనే రాజీనామా చేయాలి.. అయ్యన్నపాత్రుడు పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.. టిడిపి ప్రభుత్వం దళితుల వ్యతిరేక ప్రభుత్వం.. నారా చంద్రబాబు నాయుడు ఒక దళితునిగా పుట్టడం ఇష్టం లేదు అని ఇదివరకే వ్యాఖ్యానించారు. ఇటువంటి ముఖ్యమంత్రి పాలనలో దళితులుగా బ్రతకాలేము. అయ్యన్నపాత్రుని పైన చర్య తీసుకోపోతే ఈ ఉద్యమం తీవ్రస్థాయిలో కొనసాగిస్తామని జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేస్తామని రైలు రోకో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

# చలివేంద్రం ప్రారంభించిన... కర్నూల్ డిఎస్పి జె .బాబు ప్రసాద్



**కర్నూలు నంది పత్రిక....** కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర ప్రజల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం కర్నూల్ డిఎస్పి జె. బాబు ప్రసాద్ ప్రారంభించారు.కర్నూల్ డిఎస్పి మాట్లాడుతూ...కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వేసవికాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, వాహనదారులకు చల్లని త్రాగునీరు పొందేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.ప్రజల సేవలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని, వేసవి కాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి.

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో.



**మహబూబాబాద్, ఏప్రిల్ 03(నంది పత్రిక):** తెలంగాణ ప్రభుత్వం, కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మేరకు తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు అయన దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస రావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు, ఐడిఓసి కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# భోజనంలో మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 3 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న భోజనం గ్రామంలో శుక్రవారం మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తును ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. కుల మతాలకు అతీతంగా గ్రామంలో అందరూ సమైక్యంగా ఈ సరిగెత్తును నిర్వహిస్తూ ఉంటారు. శుక్రవారం నాడు జరిగిన వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మౌలాలి స్వామికి సూచికలు సమర్పించారు. అనంతరం మేళతాళాల మధ్య పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి గ్రామానికి సమీపంలో ఉన్న కుందు నదిలో ఖననం చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జగన్మోహన్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



**మహానంది ఏప్రిల్ 03 (నంది పత్రిక):-** వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి,మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మహబూబ్ దౌలా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహానంది మండలం తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్ వార్డులను,స్టాక్ రూమ్, మరుగుదొడ్లు, ఆస్పత్రి ప్రాంగ్రాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఆస్పత్రికి వచ్చే రోగులకు 24 గంటలు అందుబాటులో ఉంది మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కేసముద్రం, ఏప్రిల్ 03(నంది పత్రిక):** పేదవాడి కలల సాకారానికి నిదర్శనం ఇందిరమ్మ ఇండ్లని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలలో పాల్గొని ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మిఠాయి తినిపించు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఆర్థిక వెసలుబాటు లేని ప్రతి నిరుపేదను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణానికి రూ. 5లక్షలను అందజేసి ఆదుకున్నదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలని, ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆకాక్షించారు. ఉన్న ఊరిలో స్వంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, సహకరించిన ఎంఎల్ఏ డాక్టర్ మురళీనాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాజారెడ్డి వాటర్ కూలర్ వితరణ వేసవి

**బనగానపల్లె ఏప్రిల్ 3 నందిపత్రిక** వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి. రాజారెడ్డి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వాటర్ కూలర్‌ను విరాళంగా అందజేశారు. కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత విజ్ఞప్తి మేరకు అప్పట్లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాజారెడ్డి చేసిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. బోధనా, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఆయన సేవాభావాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విరాళం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.






# జీహెచ్ఎంసీకి పెరిగిన ఆదాయం...

2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కు ఆదాయం భారీగా పెరిగింది. మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం

# తర్తూరు జాతరలో రాష్ట్రస్థాయి వృషబాల బండలాగు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే... గిత్త.





**రైతు జాతరగా ప్రసిద్ధి.**

**ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి పోటీల్లో పాల్గొన్న వృషభలు.**

**శ్రీ రంగనాథ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన టిడిపి ఇన్చార్జ్ గౌరు.**

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ :3 (నంది పత్రిక ):** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రైతు జాతరగా ప్రసిద్ధి చెందిన తర్తూరు జాతరలో రాష్ట్రస్థాయి వృష బాల బండలాగు పోటీలను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి 10 జతల వృషభలు హాజరయ్యాయి. రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ఆలయ కమిటీ ద్వారా నిర్వహించడం జరుగుతుంది. తర్తూరు శ్రీ లక్ష్మి రంగనాథ స్వామి జాతర రైతు జాతరగా ప్రసిద్ధి చెందింది. వ్యవసాయం అంటే గుర్తుకొచ్చేది ఎడ్ల అని ఇప్పుడు ఎడ్ల పెంపకము తగ్గుతున్న రోజుల్లో మరల వాటిని గుర్తుచేసుకునేలా ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈపోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. గతంలో జాతరలో రైతులకు సంబంధించిన వ్యవసాయ పనిముట్లు అత్యధికముగా లభించేవి. ప్రస్తుత పరిస్థితుల్లో జాతరలో వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు లేకపోవడంతో రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. శ్రీ లక్ష్మి రంగనాథ స్వామి జాతరకు రెండవ రోజైన శుక్రవారం నందికొట్కూరు టిడిపి ఇన్చార్జ్ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి హాజరై ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి దుశాలలతో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. తర్తూరు బ్రాహ్మణ అన్నదాన సత్రంలో నూతన మంచినీటి బోరు వేయించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు బ్రాహ్మణులు అభినందనలు తెలిపారు. గద్వాల జిల్లా గట్టు మండలం రామాపురం గ్రామం జి.నల్లారెడ్డి చెందిన వృషభరాజములు3613.7 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ 40,000 అందజేశారు. మార్కాపురం సాంచవరం గ్రామం గోస్పాడు మండలం చెందిన జూపల్లి ప్రభాకర్ రెడ్డి వృషభ రాజములు 3000 అడుగుల దూరములాగి రెండో స్థానంలో నిలిచాయి. రెండో బహుమతి రూ 30,000 అందజేశారు. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం శ్రీ వాణి చెందిన వృషభ రాజములు3188 అడుగుల దూరములాగి మూడో స్థానంలో నిలిచాయి బహుమతి రూ 20,000 అందజేశారు. నంద్యాల జిల్లా డోన్ మండలం సహ గుంత ల గ్రామం ఆలమదన మోహన్ రెడ్డి చెందిన వృషభ రాజములు 3000 అడుగుల దూరములాగి నాలుగో స్థానంలో నిలిచాయి బహుమతి రూ15000 అందజేశారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం , తుమ్మలూరు గ్రామం నడిపి మార్క్ చెందిన వృషభరాజములు 2705 అడుగుల దూరము లాగి 5వ స్థానంలో నిలిచాయి. బహుమతి రూ10000 అందజేశారు. విజేతలైన వృషభరాజములు యజమానులకు నగదు బహుమతులను దాతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తర్తూరు శ్రీ లక్ష్మి రంగనాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, మండల టీడీపీ పార్టీ కన్వీనర్లు గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి,ఖాతా రమేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పిక్కిరి శ్రీనివాసులు, రవి కుమార్ యాదవ్, మందడి దొరబాబు రెడ్డి, జూపాడు బంగ్లా సుధాకర్, నల్లబోతుల రాముడు, టిడిపి జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న, తర్తూరు రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ రవికాంత్, వేణు గోపాల్ రెడ్డి,అల్లూరు బాల బాబులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పోరుమామిళ్లలో గుడ్ ఫ్రైడే సిలువ మార్గం ఘనంగా నిర్వహణ:

**భక్తి, త్యాగం మరియు ఆధ్యాత్మికఆనందం**



**పోరుమామిళ్ల ఏప్రిల్ 3 (నంది పత్రిక ):** పోరుమామిళ్లలో పవిత్ర గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ మార్గం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.నారిపోగు సింహారాయలు (రి॥) టీచర్ మరియు మనోజ్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, యేసుక్రీస్తు అనుభవించిన శ్రమలు, త్యాగాలను స్మరిస్తూ 14 స్థలాల సిలువ మార్గం భక్తి భావంతో నిర్వహించబడింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసి, ఆధ్యాత్మిక సందేశాలను ఆలకించారు. ఫాదర్ జాల విజయభాస్కర్ గారు శాంతి, ప్రేమ, సహనం మరియు సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించే అవసరాన్ని వివరించారు.కార్యక్రమంలో పొట్టిపోగు బాబు, లక్కినేని మల్లి, నారిపోగు సందీప్, వీరపోగు రాహుల్, దాసరిపల్లి రిషి, జయపాల్, అంబేద్కర్, ముండ్లపాటి అజయ్, శేఖర్ సహజ నటనతో ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు.శాంతియుతంగా, క్రమబద్ధంగా ముగిసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందినట్లు వెల్లడించారు.



# రాజధానిని మార్చటం ఇక ఎవరి తరం కాదు

**- టిడిపి సీనియర్ నాయకులు - ఏవి సుబ్బారెడ్డి**



**ఆళ్లగడ్డప్రతినిధి ఏప్రిల్ 3,నంది పత్రిక** అమరావతి రాజధానిని మార్చటం ఎవరి తరం కాదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని ఏవి ప్లాజా ఆవరణంలో స్థానిక ప్రముఖ సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ రెడ్డిటీడీపీ నాయకులు కార్యకర్తలు అమరావతి రాజధానిగా బిల్లు ఆమోదం పొందిన సంతోషంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూ గురువారం పార్లమెంటులో బిల్ ఆమోదం పొందినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. దాదాపు ఏడు సంవత్సరాలుగా మన రాష్ట్రనికి రాజధాని లేకుండా ఉండటం ఆవేదన కలిగించిందని, అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు చొరవతో రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎవరు మార్చలేని విధంగా పార్లమెంటులో బిల్లును ఆమోదం చేయించడం హర్షణీయం అన్నారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాలలో బీజేపీ నాయకులను, జనసేన పార్టీ నాయకులను కలుపుకొని వెళతామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలోది నంద్యాల కమ్యూనికేషన్ కేబుల్ ఛానల్ మేనేజర్ ధనుంజయ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, టిడిపి నాయకులు, ఏవీ అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు భవిష్యత్తుపై మరింత నమ్మకం పెంచిన అమరావతి బిల్లు.





**రంగరంగ వైభవంగా ప్రజారాజధాని సంబరాలు, బైక్ ర్యాలీలు.**

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి ...**

**ఏలూరు బ్యూరో చీఫ్ ఏప్రిల్ 3 :నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ, లోక్ సభ బిల్లుకు ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు.రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ చేసిన కూటమి నాయకులు కార్యకర్తలు, మొదటిగా ఆగిరిపల్లి అంబేద్కర్ సెంటర్ నుండి ర్యాలీ ప్రారంభించి నగరవీధుల్లో ర్యాలీ కొనసాగి బాణా సంచాలతో, రంగరంగ వైభవంగా సాగిన ర్యాలీ బస్సు స్టాండు సెంటర్లో ముగిసిన అనంతరం కార్యకర్తలు నాయకులు ఒకరినొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆంధ్ర రాజధాని విషయంలో నెలకున్న అనుమానాన్ని తెర దించి చట్టబద్ధత రావడం గొప్ప పరిణామం అన్నారు. ప్రజారాజధాని గ్రహణం వీడి చట్ట భద్రత కలిగిందన్నారు. ప్రభుత్వాలు మారినా రాజధాని శాశ్వతంగా ఉండేలా చట్టం తీసుకొచ్చిన గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అవమానాలకు,ఇబ్బందులకు తావులేకుండా ముగింపు పలుకుతూ బలమైన భవిష్యత్ కు పునాది, బంగారు బాట వేసి, తాజా బిల్లు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే బిల్లు లోక్ సభలో ఆమోదం పొందడంతో రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతీ ఒక్క రైతుకు కార్యకర్తల శ్రమకు ఫలితం లభించిందన్నారు. వారందరికీ ఈ విజయాన్ని అంకితం చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల ఊబిలో నెట్టి వెళ్లిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీసేందుకు పూర్తి తోడ్పాటు అందిస్తున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకు, హోంమంత్రి అమిత్ షాకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారధి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో నిలిచే బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వైసిపి పార్లమెంటు సభ్యులు. వాకౌట్ చెయ్యడం, వారి మూరక్తత్వాన్ని విద్వంస వైఖరిని స్పష్టం చేసిందని అన్నారు. ప్రపంచ స్థాయి నగరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్మిస్తూ ఉంటే అమరావతిని స్కాం గా భ్రమరావతిగా జగన్మోహన రెడ్డి అనడం అయన అజ్ఞానాన్ని, తెలియజేస్తుంది అన్నారు. రైతులుపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న అసూయను స్పష్టం చేస్తోందని. ప్రజలు కూటమితో కలసి అభివృద్ధి వైపు నడవడానికే ఉత్సాహంగా ఉన్నారన్నారు. లోక్ సభ మద్దతుతో మరింత వేగంగా ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి త్వరలోనే పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం అంకితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ



**బనగానపల్లె ఏప్రిల్ 3నంది పత్రిక** నందవరం చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.ఇందులో భాగంగా ఆలయ సిబ్బంది, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 'పరాభవ' పోరాటాల్లో జాతీయ పక్షాలు

గ్రహగతులు, మానవ జీవితాలపై వాటి ప్రభావం గురించి నాకు ప్రాథమిక అవగాహన కూడా లేదు. అయితే ఇప్పుడు మన దేశంలో నెలకొనివున్న రాజకీయ పరిస్థితులను చూస్తుంటే 'మనం చాలా ఆసక్తికర కాలంలో నివసిస్తున్నా'మని అనిపిస్తోంది. అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి శాసనసభలకు ఈ నెల 9, 23, 30 తేదీలలో ఎన్నికలు జరగనున్నాయి. భారతీయ జనతా పార్టీ ఇటీవలి సంవత్సరాలలో ప్రప్రథమంగా కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లోని మధ్యేవాద లేదా మధ్య వామపక్ష రాజకీయ పక్షాల (లెఫ్ట్ ఆఫ్ సెంటర్ పొలిటికల్ పార్టీస్)ను భారతీయ జనతా పార్టీ సవాల్ చేస్తోంది. కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ రెండూ భావజాల వర్ణపటంలో ఎడమ వైపునే ఉన్నాయి. తమిళనాడులో డీఎంకే సారథ్యంలోని ఫ్రంట్ (కాంగ్రెస్ ఇందులో భాగస్వామి), పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ మధ్య వామపక్షాలు అనేది స్పష్టం. ఈ రాజకీయ పక్షాలు అన్నీ భారత రాజ్యాంగానికి నిబద్ధమైవి. సమాఖ్య పాలనా విధానాన్ని, శాసన వ్యవస్థ సర్వోత్కృష్టత, సామాజిక న్యాయం, సమానత్వంతో కూడిన అభివృద్ధిని, సంక్షేమ చర్యలు, పత్రికా స్వాతంత్ర్యం, ఉదారవాద ఆర్థిక వ్యవస్థను ఔదలదాలుస్తున్నాయి. ఎల్‌డీఎఫ్, డీఎంకే, టీఎమ్‌సీ వరుసగా కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీలను సవాల్ చేస్తున్న భారతీయ జనతా పార్టీ భావజాల వర్ణపటంలో కుడివైపు ఉండే రాజకీయ పక్షం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాత్రమే భావజాల వర్ణపటంలో పూర్తిగా కుడివైపు ఉంటుందని నేను విశ్వసిస్తాను. అయితే తాను ఒక రాజకీయ పార్టీని కానేకానని ఆరెస్సెస్ గట్టిగా చెబుతోంది. అయితే తన ప్రముఖ నాయకులు అందరూ గతంలోనూ, ఇప్పుడు బీజేపీలో కీలక బాధ్యతల్లో ఉన్నారనే వాస్తవాన్ని ఆరెస్సెస్ అయిష్టంగా అంగీకరిస్తుంది. బీజేపీ ప్రభుత్వాలలోని చాలా మంది మంత్రులు సంఘ్ ప్రచారక్‌లు. ఇంకా స్వయం సేవక్‌లుగా కొనసాగుతున్నవారే. ఆరెస్సెస్‌ను తల్లిగాను, బీజేపీని బిడ్డగాను సామాన్య భారతీయులు భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ విధానాలు, సిద్ధాంతాలు హిందూ ఆధిక్యతా భావన (హిందూత్వ)లో వేళ్లూనుకుని ఉన్నాయి; ఇవి కేంద్రీకరణ పాలనా పద్ధతులకు, హిందీ భాషకు ప్రాధాన్యమిస్తాయి. 2014 వరకు అనేక అంశాలపై ఉన్న ఏకాభిప్రాయాన్ని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ఉద్దేశపూర్వకంగా భగ్నం చేసింది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ శాసనసభా ఎన్నికల పోరాటం వామపక్ష మధ్యేవాద, దక్షిణపక్ష మధ్యేవాద కూటముల మధ్య జరగనున్నది. కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్, సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ గత ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలలో ప్రాబల్యం వహిస్తున్నాయి. చిన్న పార్టీలు అన్నీ ఆ రెండు కూటములలో ఏదో ఒక దానిలో చేరడం అనివార్యమవుతోంది. యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌లు ఒక దాని తరువాత ఒకటి అధికారంలోకి రావడం కేరళ రాష్ట్ర రాజకీయాల విలక్షణతగా ఉన్నది. అయితే 2021లో కేరళ ఓటర్లు ఈ ఆనవాయితీకి తెరదించారు. 2016లో విజయం సాధించిన ఎల్‌డీఎఫ్‌కే 2021లో కూడా మళ్లీ అధికారమిచ్చారు. యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ రెండూ శక్తిమంతమైన కూటములే. ఈసారి మరింత పదునైన, పటిష్ఠ వ్యూహాలతో ఎన్నికల గోదాలోకి దిగాయి. వయసు మీరిన పినరయి విజయన్ సారథ్యంలో ఎల్‌డీఎఫ్ గత పదేళ్లుగా అధికారంలో ఉందని, రాష్ట్ర పాలన, రాజకీయాలలో మార్పునకు సమయమాసన్నమయిందని కేరళ ప్రజలు భావిస్తున్నారు. 2018లో వరదల ఉపద్రవంలోను, 2024లో వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన విపత్తులోను పినరయి విజయన్ ప్రభుత్వం బాధితులను సమర్థంగా ఆదుకోలేదన్నది ప్రజాభిప్రాయంగా ఉన్నది.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉద్యోగి సస్పెండ్

**మహానంది ఏప్రిల్ 03 (నంది పత్రిక):-**

మహానందిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారని ఆలయ ఏఈవో ఎరమల మధు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు నిర్లక్ష్యం వహించారని గుర్తించినట్లు చెప్పారు. విచారణ చేసిన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఈవో శ్రీనివాస రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్రంలో భూసంబంధిత వివాదాలు లేకుండా ప్రతి నెలా మీ భూమి- మీ హక్కు కార్యక్రమం







## భూహక్కులు పరిరక్షణకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ


## రైతుల్లో ఆనందం

## రైతులు, ప్రజలు హక్కులను గౌరవిస్తూ వారికి భరోసా కల్పించడమే సుపరిపాలన లక్ష్యం

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...

**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రియల్ 3నంది పత్రిక** : ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామంలో శుక్రవారం "మీ భూమి- మీ హక్కు" ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులకు రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలును 453 మంది రైతులకు పంపిణీ చేశారు. మిగతావి కూడా త్వరితగతిన పంపిణీకి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతంగా జరుగుతున్నాయని, రైతులు, ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. భూములు రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, రాష్ట్రంలో నెలా జరిగే పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు అవుతున్నారన్నారు. గత ప్రభుత్వం టైటిల్ డీడ్ యాక్టు తీసుకువచ్చి గత ప్రభుత్వ అధినేత ఫోటోను ముద్రించుకుని అందించారని, ఇది ప్రజలకు, రైతులకు భూములు భద్రతలో పలు అనుమానాలు తలెత్తి గత ప్రభుత్వానికి వ్యతిరేక ఓటువేశారని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వ సమయంలో తప్పులు, తడకలుతో రైతులకు, ప్రజలకు విపరీతమైన ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. గత ప్రభుత్వ చర్యలుపై అన్ని వర్గాలు ప్రజలు అసంతృప్తి నేపథ్యంలో రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని ఇచ్చిన హామీని విజయవంతంగా నెరవేరుస్తున్నామన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడం మన ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వం అసంబద్దంగా తెచ్చిన ల్యాండు టైటలింగు యాక్టు రద్దుతో రైతులకు, ప్రజలకు అభద్రతను దూరం చేశామని మంత్రి స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్నతప్పు ఉన్నను పట్టాదారు పాసు బుక్కు తీసుకోవద్దని, ఆ తప్పును సరిచేసి మీకు అందించడం జరుగుతుందని మంత్రి భరోసానిచ్చారు. అధికారులు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకాలు రూపొందించి, రైతులకు అందించాలని అన్నారు. గ్రామానికి బయట ఉన్న రైతులకు ఫోను చేసి పట్టాదారు పాసు పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు హక్కులను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యలను పారదర్శకంగా, వివాదాలు లేకుండా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి నెలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈవో, నియోజక వర్గ ప్రత్యేక అధికారి పి.జగదాంబ, తహశీల్దారు పి.యన్.వి. ప్రసాదు, సంబంధిత శాఖలు అధికారులు, సచివాలయం ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..



# హర్మూజ్ జలసంధిని తెరవగలిగితే ఇక చమురు వెల్లువే!: ట్రంప్

గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచి, చమురుతో భారీగా సంపద సృష్టించవచ్చని ఆయన అన్నారు. ఇది ప్రపంచానికి ఒక 'జాక్‌పాట్' అవుతుందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "మరికొంత సమయం ఇస్తే, మనం సులభంగా హర్మూజ్ జలసంధిని తెరవవచ్చు, చమురును తీసుకోవచ్చు, భారీగా సంపద కూడబెట్టవచ్చు. ఇది ప్రపంచానికి ఒక వరం అవుతుంది కదా?" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వెలువడుతున్న తరుణంలోనే, సముద్రయాన ఇంటెలిజెన్స్ సంస్థ 'విండ్‌వార్డ్' తాజా డేటాను విడుదల చేసింది. ఏప్రిల్ 1న 16 నౌకలు ఈ జలసంధిని దాటాయని, అంతరాయం తర్వాత నౌకల రాకపోకలు జరగడం ఇది వరుసగా మూడో రోజని తెలిపింది. గత మార్చి మధ్యలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పర్యవేక్షణలో తప్పనిసరి నావిగేషన్ కారిడార్‌ను అమలులోకి తెచ్చింది. దీంతో అనేక నౌకలు తమ మార్గాలను మార్చుకోవాల్సి వచ్చింది. అయితే, ఇటీవల ఒమన్‌కు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లు, సోహార్ అనే ఒక ఎల్ఎన్జీ క్యారియర్.. ఇరాన్ నియంత్రిత మార్గాన్ని తప్పించుకుని అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. ఉద్రిక్తతలు పెరిగాక ఈ జలసంధిని దాటిన తొలి ఎల్ఎన్జీ క్యారియర్ ఇదే కావడం గమనార్హం. ఫ్రాన్స్‌కు చెందిన సీజీఏం సంస్థకు సంబంధించిన ఒక కంటైనర్ నౌక కూడా ఈ మార్గం గుండా ప్రయాణించింది. ఆంక్షల తర్వాత ఒక పాశ్చాత్య దేశానికి చెందిన నౌక ప్రయాణించడం ఇదే మొదటిసారని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 25 శాతం నౌకల యజమానుల వివరాలు తెలియకపోవడం నిఘాను సంక్లిష్టంగా మారుస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# అంబేద్కర్ విగ్రహంపై వెనక్కి తగ్గేదే లేదు

## ప్రజా సంఘాల గర్జన!

"జాతి గర్వించదగ్గ మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి ఇచ్చే గౌరవం ఇదేనా?" అంటూ శుక్రవారం బాలానగర్ లో ప్రజా సంఘాలు నిప్పులు చెరిగాయి. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడుతూ, ఈరోజు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం రణక్షేత్రంగా మారింది.బాలానగర్ చౌరస్తా నుంచి ఫ్లైఓవర్ కింది భాగంలో విగ్రహాన్ని ప్రతిష్టించాలి.లేదంటే వెటర్నరీ హాస్పిటల్ దగ్గర ఉన్న 10 గుంటల భూమిని కేటాయించి, అక్కడ సముచిత రీతిలో విగ్రహాన్ని నెలకొల్పాలి.

**ఎంఆర్వో ఆఫీసు వద్ద వద్దు.. అది అవమానమే!** "అంబేద్కర్ అంటే ఒక ఆఫీసు మూలనో, గోడ పక్కనో పెట్టే విగ్రహం కాదు.. ఆయన ఈ దేశపు వెలుగు. ఎంఆర్వో ఆఫీసు వద్ద మొక్కుబడిగా విగ్రహం పెట్టి చేతులు దులుపుకుంటామంటే చూస్తూ ఊరుకోం. అది ఆ మహనీయుడిని అవమానించడమే" అని నాయకులు ఉద్వేగంతో హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "మా కోరిక న్యాయమైనది. గౌరవప్రదమైన స్థలంలో విగ్రహం పెట్టకపోతే, బాలానగర్ గడ్డపై మరో చారిత్రాత్మక ఉద్యమాన్ని చూస్తారు. మా రక్తంలో ప్రవహిస్తున్న అంబేద్కర్ ఆశయాల సాక్షిగా చెబుతున్నాం.. మా డిమాండ్లు నెరవేరే వరకు విశ్రమించేది లేదు. అవసరమైతే ప్రాణాలకైనా సిద్ధం!" అని గర్జించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నేతలు, దళిత బహుజన నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అధికారులు వెంటనే స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు అల్టిమేటం జారీ చేశారు.

# అమరావతి ఏకైక రాజధాని గా చట్టబద్ధతపై సీఎం నారా చంద్రబాబును అభినందించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా మరియు తదితరులు

**అమరావతి,బ్యూరో చీఫ్ ఏప్రిల్ 3:నంది పత్రిక** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఘనంగా స్వాగతం పలికి, అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా స్థిరపరచడంపై హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ శ్రేణులు "జై అమరావతి" నినాదాలతో కార్యాలయం మార్మోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాకుండా, ఐదుకోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రజలంతా ఈ నిర్ణయాన్ని పండుగలా జరుపుకుంటున్నారని పల్లా తెలిపారు. ప్రతి ఇంట్లో దీపాలు వెలిగిస్తూ అమరావతికి చట్టబద్ధత లభించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఇది ప్రజల ఆనందానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అపార అనుభవం, అభివృద్ధి పట్ల అంకితభావం వల్లే అమరావతి నేడు శాశ్వత రాజధానిగా స్థిరపడిందని పల్లా గారు కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాజధాని అంశంపై వెనుకడుగు వేయకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా నిరంతరం కృషి చేసిన నాయకత్వం చంద్రబాబు దేనని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం తరతరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



రైతుల త్యాగాలు, ప్రజల దీర్ఘకాలిక పోరాటం ఫలితంగా ఈ రోజు సాధ్యమైందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే విధంగా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.గత వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పల్లా గారు తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకునే విధంగా తీసుకున్న ఆ నిర్ణయాలు ప్రజల్లో అయోమయం సృష్టించాయని పేర్కొన్నారు. ఇప్పుడు అమరావతిని ఏకైక రాజధానిగా స్పష్టత రావడంతో అన్ని అనుమానాలకు తెరపడిందన్నారు.అమరావతి నిర్మాణంపై ఇంకా గందరగోళ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయడం సరైంది కాదని పల్లా హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాదిరెడ్డికి ఘన సన్మానం

రాజాపూర్ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన అడ్వొకేట్ యాదిరెడ్డి జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గురువారం వ్యాపారవేత్త లింగరెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మల్లేపల్లి గ్రామవాసి జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికవడం చాలా సంతోషకరమైన విసయం అని అనందం వ్యక్తం చేశారు.అదే విధంగా అడ్వొకేట్ యాదిరెడ్డి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడి అవకాశం కల్పించిన తోటి అడ్వొకేట్ లకు కృతజ్ఞతలు తెలిపారు.మాల్లేపల్లి గ్రామంలో ఉన్న ప్రతి పేదవాడికి న్యాయం అయ్యే విధంగా కృషి చేస్తాను మరియు మల్లేపల్లి గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగం, నారాయణరెడ్డి, వెంకట్ రాజు,బండకడి శ్రీనివాస్ రెడ్డి,యోగనాద్,పొలమోని శ్రీనివాస్,ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి,ఆల్వాల శ్రీశైలం,బుచ్చయ్య ,అవ రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి.

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాందూరి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఈవో భవాని శంకర్ స్వామివారి లడ్డు ప్రసాదం స్వామి వారి ఫోటోను బహుకరించారు.

## ఆలయ సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ.

## స్వామివారి నిత్య రాబడి రూ.23.99 లక్షలు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ఉంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉంజల్ సేవను ఆలయ పురవీధులలో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ నిత్య రాబడి లో భాగంగా శుక్రవారం రోజున రూ. 23,99,920, ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు హిందూ సమ్మేళనం



## శ్రీ వెంకటేశ్వర కాలనీలో విస్తృత ప్రచారం

హనుమకొండ జిల్లా హసన్పర్తి మండల కేంద్రం

ఎర్రగట్టుగుట్ట సమీపంలోని శ్రీ వేంకటేశ్వర కాలనీ వాసులు శుక్రవారం రోజు హిందూ బంధువుల ఐక్యతకై హిందూ సమ్మేళన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ వల్లాల యుగంధర్ మాట్లాడుతూ హిందూ సమ్మేళనం అనేది విభిన్న హిందూ వర్గాలను ఏకం చేయడానికి, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడానికి, సనాతన ధర్మం యొక్క గొప్పతనాన్ని గొప్ప వారసత్వాన్ని పరిరక్షించడానికి ఒక కీలకమైన వేదిక అన్నారు. ఈ సమావేశాలు సాంస్కృతిక విలువలను బలోపేతం చేస్తాయని జాతీయ సమస్యలపై అవగాహన కల్పిస్తాయని ఆత్మ నిర్భర హిందూ సమాజాన్ని ప్రోత్సహిస్తాయని అన్నారు. తదనంతరం 11-04- 2026 శనివారం రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీ ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే హిందూ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని హిందూ బంధువులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి,

ఆది రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్,భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, యోగేశ్వర్ రెడ్డి యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శ కార్యక్రమం.

డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో విషాద వాతావరణం నెలకొంది. లోక్యతండాకు చెందిన మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్ అన్న పానుగోతు పంతులు నాయక్ ఇటీవల మరణించడంతో, మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని నివాసానికి చేరుకున్న ఆమె, పంతులు నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంతులు నాయక్ గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి స్థానికంగా తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బోడా శ్రీను నాయక్, కొంపల్లి వేణుగోపాల్ రెడ్డి, బాణోత్ శారదతో పాటు స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ కౌన్సిలర్లతో వీడియో కాన్ఫరెన్స్


మన గ్రామం మన బాధ్యత గ్రామ భద్రతపై ఎస్పీ కీలక ఆదేశాలు గ్రామ భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపైమహబూబాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ గ్రామ స్థాయి భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాలిటీలో 3 వార్డులు, ప్రతి మండలంలో 2 గ్రామాలు ఎంపిక చేసి మొత్తం 42 గ్రామపంచాయతీలు, 13 వార్డుల్లో మన గ్రామం మన బాధ్యత నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తూ డోర్ టు డోర్ సర్వేలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెల్మెట్ లేని వారికి పంపిణీ కార్యక్రమం కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2 నుండి హెల్మెట్ లేకుండా గ్రామాలు, వార్డుల్లో ప్రవేశం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు.

గ్రామాల్లో భద్రతను పెంపొందించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు వేగవంతం చేస్తున్నామని,"సీసీ కెమెరాల పర్యవేక్షణలో మన గ్రామం" లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

అలాగే గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అలవాటు పడిన వారికి పునరావాసం కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. "హెల్మెట్ ఒక ప్రాణాన్ని కాపాడుతుందిడ గ్రామ భద్రత మనందరి బాధ్యత" అని ఎస్పీ స్పష్టం చేస్తూ, ప్రజలు హెల్మెట్ ధరించడంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కురవి, సీరోల్ పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించిన ఎస్పీ, పోలీస్ శాఖకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు అందరినీ అభినందించారు.

# ముంబై టు హైదరాబాద్ డ్రగ్స్ రవాణా






**ముంబై నుంచి నైజీరియా మహిళ తీసుకు వచ్చిన వైనం 2.35 లక్షల విలువ చేసే 7.5 గ్రాముల కొకై న్ స్వాధీనం నైజీరియా మహిళ అరెస్ట్**

ముంబై నుంచి హైదరాబాద్ కు నైజీరియన్ మహిళ డ్రగ్స్ తీసుకొస్తుందనే సమాచారం మేరకు సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య, ఎస్సై శివకృష్ణ సిబ్బంది కలిసి వలపన్ని నిందితురాలను పట్టుకున్నారు. నైజీరియన్ జేమ్స్ టెస్లింగ్ యామ్యూనల్ వద్ద ఉన్న 7.5 కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ముంబై నుంచి పారడైజ్ ప్రాంతంలోని సన్ సైన్ ఆసుపత్రి కి ప్రాంతానికి వస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ సౌజన్య, ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుల్ రాజు, రవి, శిల్ప కలిసి కాపుగాసి ముంబై నుంచి సన్షైన్ హాస్పిటల్ ప్రాంతంలోకి ఆటోలో వచ్చిన నైజీరియన్ మహిళను డిటిఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. నిందితురాలు వద్ద ఐదు పాకెట్లలో ఉన్న 7.5 గ్రామ్స్ కొకైను స్వాధీనం చేసుకున్నారు.

ముంబైలో గ్రాముకు రూ.15,000 చొప్పున కొనుగోలు చేసి హైదరాబాదులో రూ.30 వేల కు గ్రామ చొప్పున అమ్మడానికి డ్రగ్స్ ను తీసుకు వచ్చినట్లు విచారణలో వెల్లడయ్యింది. నిందితురాలను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. కొకైన్ పట్టుకున్న డిటిఎఫ్ సికింద్రాబాద్ ఎక్సైజ్ డిటిఎఫ్ సిఐ సౌజన్యతో పాటు సిబ్బందిని హైదరాబాద్ డిసి అనిల్ కుమార్ రెడ్డి, ఏఎస్ శ్రీనివాసరావు అభినందించారు.

## జగద్గిరిగుట్టలో ఘనంగా అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు

**మజ్జిగ, అంబలి, పండ్ల పంపిణీతో 1,000 మందికి సేవ**



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 03 –** అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా జగద్గిరిగుట్ట లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట బస్టాప్ వద్ద భక్తులకు మజ్జిగ, అంబలి, అరటి పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి సుమారు 1,000 మంది ప్రజలకు సేవ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ జగన్, పార్థీ ప్రకాష్ గుప్తా, తేరాల శ్రీనివాస్, నేతి శంకర్ గుప్తా, రేగూరి ప్రవీణ్ గుప్తా, ఉప్పల రమేష్ తదితరులు హాజరై సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాపూజీ హైస్కూల్ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ కార్యక్రమంలో తుముకుంట రామచంద్ర ప్రసాద్, నీవ్వ ప్రభాకర్ రావు, శ్రీనివాసులు పంతులు, సంతోష్ గోవర్ధన్ రెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కొచ్చి ఎస్ డి ఐ లో 6 నెలల పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**ఆసక్తిగల గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**హైదరాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 03** పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీలు, ముఖ్యంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (ధీూజా) సహకారంతో కేరళ రాష్ట్రంలోని కోచ్చి లోని స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ (ఎస్ డి ఐ) లో 6 నెలలు పూర్తిగా రెసిడెన్షియల్ నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహించబడుతున్నాయని జిల్లా గిరిజనుల అభివృద్ధి అధికారి ఆర్.కోటజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న కోర్సులు ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ (ఆయిల్, గ్యాస్) ఇండస్ట్రియల్ వెల్డర్ (ఆయిల్, గ్యాస్), ప్రాసెస్ ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫాబ్రికేషన్ (ఆయిల్, గ్యాస్), టెక్నిషియన్ ఎలక్ట్రానికి మాన్యుఫాక్చరింగ్ (వినికిడి లోపం ఉన్న అభ్యర్థులకు మాత్రమే).

**అర్హతలు..** డిప్లొమా (టెక్నికల్) లేదా ఐటిఐ ఉత్తీర్ణులు / ఫైనల్ ఇయర్ విద్యార్థులు / ఐటీఐ ఉత్తీర్ణులు దరఖాస్తు చేయవచ్చు.- గరిష్ఠ వయస్సు 25 సంవత్సరాలు (ఎస్.టి అభ్యర్థులకు 2 సంవత్సరాల సడలింపు).

**కోర్సు వివరాలు..** వ్యవధి: 6 నెలలు (పూర్తిగా రెసిడెన్షియల్), సౌకర్యాలు భోజనం, వసతి, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, సేఫ్టీ షూస్ ఉచితం. ప్రారంభ ఫీజు రూ.5,000, ప్రయాణ ఖర్చులు అభ్యర్థి/శాఖ భరించవలెను

**సర్టిఫికేషన్, ఉపాధి అవకాశాలు..** కోర్సు పూర్తి చేసిన వారికి న్ సి వి ఈ టి ద్వారా సర్టిఫికేట్ అందజేయబడుతుంది. అదనంగా ఉద్యోగ అవకాశాల కోసం ప్లేస్మెంట్ సహాయం కల్పించబడుతుంది. గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని కోరడమైనది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ కార్యాలయానికి సమాచారం అందించి, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు ఫారం నింపి, దాని జిరాక్స్ ప్రతిని ఈ కార్యాలయానికి సమర్పించవలెను. మరిన్ని వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం, హైదరాబాద్ను సంప్రదించవచ్చు అని తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ: 10 ఏప్రిల్ 2026.

## దొడ్డి కొమురయ్య పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకం



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 03** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆద్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించబడినది. ఈ కార్యక్రమం లో ఆర్.ఎస్.చంద్రావతి, జిల్లా రెవెన్యూ అధికారి టి.ఝాన్సీ రాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పాల్గొని వారి సేవలను కొనియాడారు. జిల్లా రెవిన్యూ అధికారి జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టి.ఝాన్సీ రాణి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య రైతుల హక్కుల కోసం పోరాడారు. 1946లో జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమములో గొంగల్ల తిరుపతి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి, కురుమ సంఘం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా దయ్యాల గట్టయ్య, ఉపాధ్యక్షులు కురుమ సంఘం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది, వెనుకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



## 1.104 కేజీల గంజాయి పట్టివేత



**క్రైమ్ బ్యూరో ఏప్రిల్ 03** రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ సీఐ సుభాష్ చంద్ర సిబ్బంది కలిసి బాలానగర్ అస్మత్ పేట ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న సాయి హరీష్ ను పట్టుకున్నారు. నిందితుడు వద్ద ఉన్న 1.104 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గంజాయి నాందేడ్ ప్రాంతం నుంచి తీసుకు వచ్చినట్లు సమాచారం. నిందితున్ని గంజాయిని బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

## జిల్లా నూతన డిసిసి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కూన శ్రీనివాస్ గౌడ్ కి శుభాకాంక్షలు వెల్లువ



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 03** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల, వివిధ బస్తీల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు షాపూర్ నగర్ లోని వారి నివాసానికి వచ్చి శ్రీనివాస్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన ఒడిస్సీ, కథక్ నృత్య ప్రదర్శనలు



**మాదాపూర్ ఏప్రిల్ 03** మాదాపూర్ లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భగ్నగా శుక్రవారం ఒడిస్సి, కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ధారోహర్ డాన్స్ అకాడమీ నీలాంజన చౌదరి ఆధ్వర్యంలో ఒడిస్సి నృత్య ప్రదర్శనలో శాంతాకారం, నమామి, దళి, స్థాయీ, జనసమోహిని పల్లవి, ప్రదర్శనలు తనుశ్రీ, రియా నూతన, పావని, దేబశ్రీ, మొదలైన వారు ఓరదర్శించి మెప్పించారు. కథక్ నృత్య ప్రదర్శనలో గురువందనా, అభినయ, తరణ అంశాలను కళాకారులూ నీతి, నవ్య, సన, డెబ్రాని, రుద్రాణి, ఖుష్బూ, ఇందిరా, పూజిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. గురు సంజయ్ కుమార్ జోషి, ప్రీతీ మహాపాత్ర, శ్రావ్య మానస లు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



## రైతు సంఘం మహాసభను జయప్రదం చేయండి : మాటూరు బాలరాజు గౌడ్.

**ఆలేరు ఏప్రిల్ 03** జిల్లా రైతాంగ సమస్యలపై తెలంగాణ రైతు సంఘం అనేక బహుముఖ పోరాటాలు నిర్వహించిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరు బాలరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు కాలంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించుటకు ఈ నెల ఏడున భూదాన్ పోచంపల్లిలో జరిగే జిల్లా మూడవ మహాసభలను అధిక సంఖ్యలో రైతులందరూ హాజరై జయప్రదం చేయాలని జిల్లా రైతు కూలి సంఘం సమావేశంలో అన్నారు. రైతు లేనిది రాజ్యం లేదు మాట ప్రతి ఒక్కరు ఉచ్చరించేది కానీ రైతు శ్రేయస్ కోసం పాలకవర్గాలు బాధ్యతగా పనిచేయడం లేదని, రైతులందరికీ గమనించిన ఆవేక్షత ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్కాకుల సుభాష్, మేరిగాడి రమేష్, అంగిరేకుల,శీను, ఘనగాని మల్లేశం, మేరిగాడు బాలయ్య ,దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 03** సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, ఆయన ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సాధించుకున్నదంతా సవరణతో పోయింది..!

పార్లమెంట్ గతవారంలో అమలులోకి తెచ్చిన ట్రాన్స్‌జెండర్ హక్కుల సంరక్షణ (సవరణ) చట్టం, గత దశాబ్దకాలంలో ట్రాన్స్ ప్రజల జీవితాల్లో వచ్చిన పరిమిత ప్రగతిని కూడా వెనక్కి నెట్టేదిగా ఉన్నది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కానీ, తామే ఏర్పాటు చేసిన జాతీయ ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కౌన్సిల్‌ను కానీ, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన న్యాయమూర్తుల అడ్వైజరీ కమిటీని కానీ సంప్రదించకుండా, ఒక్క ట్రాన్స్ ప్రతినిధి కూడా లేని భారత పార్లమెంట్ 2019లో తానే చేసిన చట్టంలో ఎవరూ అడగని సవరణలను తెచ్చింది. అసలు ఆ చట్టమే కొంత లోపభూయిష్ఠం అనుకుంటే, ఇప్పటి సవరణలు 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన నల్సా తీర్పులోని ప్రధాన మార్గదర్శకాలను నీరుగార్చేలా ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రధానమైన మార్గదర్శకం తమ జెండర్‌ను నిర్ణయించుకునే పూర్తి అధికారం వ్యక్తులకు మాత్రమే ఉండాలనీ, ఒకరి జెండర్‌ను నిర్ణయించే అధికారం ఏ డాక్టర్లకూ మెడికల్ బోర్డులూ లేదా ఏ ప్రభుత్వ కమిటీలకూ ఉండదనీ చెబుతోంది. ప్రస్తుత చట్ట మార్పులు దీనికి పూర్తి విరుద్ధంగా అటువంటి 'పరీక్షలు చేసే అధికారాన్ని' మెడికల్ బోర్డులకు కట్టబెట్టాయి. ఉన్నత న్యాయస్థానం నల్సా తీర్పు ద్వారా వ్యక్తులందరికీ ('ట్రాన్స్' వ్యక్తులకు మాత్రమే కాదు) జెండర్‌ను నిర్ణయించుకునే అధికారాన్ని ఇచ్చింది. అంటే పుట్టుకతో ఆపాదించిన మగ, ఆడ అనే జెండర్‌ను కాకుండా తాము గుర్తించుకున్న జెండర్‌లో బతకాలనుకునే వ్యక్తులు, ఇతర జెండర్ వ్యక్తులుగా మారటమే కాకుండా ఈ రెండింటి అవతల, నాన్ బైనరీగా కూడా ఉండొచ్చు. పుట్టుకతో ఆపాదించే మగతనాన్ని వద్దనుకుని తమ లోపలి ఆడతనాన్ని స్వంతం చేసుకునే వ్యక్తి తనను తాను స్త్రీగా, ట్రాన్స్ మహిళగా, లేదా హిజ్రా, కిన్నెర, జోగ్తా... అనే వివిధ రకాలుగా పిలుచుకుంటారనీ; పుట్టుకతో ఆపాదించే ఆడతనాన్ని కాకుండా తమలోని పురుషత్వాన్ని గుర్తించుకుని దానితో బతకాలనుకునే ట్రాన్స్ పురుషులు కూడా ఉన్నారనీ, మూడో జెండర్‌గా కొంతమంది మాత్రమే తమను తాము గుర్తించుకుంటారన్న అవగాహన నుంచి వచ్చిన మార్గదర్శక సూత్రమిది. శరీరపరంగా ఆడ/మగ రెండు వర్గాల్లో ఇమడని శరీర లక్షణాలు ఉండే ఇంటర్ సెక్స్ వ్యక్తులు కూడా తమ శరీరాలపై పూర్తి హక్కులు కలిగి, తమ జెండర్‌ను నిర్ణయించుకునే హక్కును ఈ తీర్పు ప్రకారం పొందారు. ఇదంతా వైద్యశాస్త్రం, లేదా జీవశాస్త్రజ్ఞులు ఇచ్చిన జ్ఞానం కాదు. అణగారిన ఇతర సమూహాల లాగే, ఆయా ట్రాన్స్ సమూహాలు తమ గురించి తాము ఉత్పన్నం చేసుకున్న జ్ఞానం. గత కొన్ని దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా ఈ సమూహాలే వైద్యులను, సైకాలజిస్టులను, పోలీసులను, బ్యూరోక్రాట్లను, మేధావులను, రచయితలను సమాజాన్ని మొత్తం చైతన్యవంతం చేసుకుంటూ వస్తున్నాయి. వలస పాలనకు ముందు పురుషుల మధ్య సమ లైంగికతకు, స్త్రీపురుష చట్రంలో ఇమడని వ్యక్తులకు భారతీయ సమాజంలో, సంస్కృతిలో, రాచరిక వ్యవస్థలో చోటు ఉంది. బ్రిటిష్ విక్టోరియన్ సంప్రదాయ భావజాలం ప్రభావంతో బ్రిటిష్ సమాజంతో పాటు, బ్రిటిష్ సామ్రాజ్యం ఉన్న అన్ని చోట్లా పితృస్వామ్య జెండర్ వ్యవస్థలో ఇమడని వ్యక్తులను, సమూహాలను అనుమానితులుగా, నేరస్థులుగా పరిగణించే చట్టాలు వచ్చాయి. వాటిలో మొదటిది సమలైంగికత్వాన్ని నేరం చేసిన సెక్షన్ 377. ఈ చట్టాల అమలులో వైద్యులు, వారి జ్ఞానం, వారు తయారు చేసిన పరీక్షలు కీలక పాత్ర పోషించాయి. 1990ల తర్వాత వచ్చిన హిజ్రా, ట్రాన్స్, ఇతర క్వీర్ ఉద్యమాలు తమ పట్ల తమ కుటుంబాలు, విద్యా సంస్థలు, ఆఫీసులు, తోటి సమాజం చూపించే తీవ్ర వివక్ష, చేసే లైంగిక హింస గురించి వివరంగా చెప్పాయి. 'సాధారణ' మనుషులు తేలిగ్గా అసాధారణమైన క్రూరత్వాన్ని తమ మీద చూపించటానికి ఒక ప్రధాన కారణం 'తమ ఉనికినే నేరమయం చేసిన వలసవాద చట్టాలేనని, వాటిని తొలగించి అందరిలా పౌరులుగా పరిగణించని భారత ప్రభుత్వమే'నని తేటతెల్లం చేశాయి. తమకు ఆపాదించిన ఆడ, మగ జెండర్‌లను తిరస్కరించే వారికి కూడా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు వర్తిస్తాయని 2014లో ఉన్నత న్యాయస్థానం తీర్పు చెప్పి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరు దశాబ్దాలకు వారికి పౌరసత్వాన్ని ప్రసాదించింది. తమిళనాడు, కేరళ, ఒరిస్సాతో పాటు అనేక రాష్ట్రాల్లో ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డులు స్త్రీలు, బలహీన వర్గాల కోసం ఉండే కొన్ని సంక్షేమ పథకాల పరిధిలో ట్రాన్స్ సమూహాల వ్యక్తులకు కూడా కొంత అవకాశం కల్పించాయి. కానీ ఇవి తెలంగాణతో సహా అత్యధిక రాష్ట్రాల్లో అత్యంత పరిమితులతో కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. ఇప్పటికీ ట్రాన్స్ సమూహాల్లో అత్యధికులు జీవన పోరాటంలో చిక్కుకుని, సమాజం అంచుల్లో బ్రతుకుతూ, ఏ రకంగానూ ప్రభుత్వ సహాయాన్ని అర్థించరు. వ్యక్తులకు తమ జెండర్‌ను నిర్ణయించుకునే అధికారం ఉంటుందని, లింగ, జెండర్ అస్తిత్వం శరీర అవయవాల నుంచి వచ్చేది కాదని సుప్రీంకోర్టు 2014లో ఒప్పుకున్న సత్యాన్ని పక్కకు తోసి, ఈ 2026 చట్ట సవరణలు ట్రాన్స్ జెండర్ల అస్తిత్వాన్ని, ఇంటర్ సెక్స్ శరీరాలతో ముడేసి, జెండర్, లింగపరమైన సోయి లేని శాస్త్ర జ్ఞానంతో పనిచేసే మెడికల్ టెస్టులకు అనుసంధానించి మనల్ని కొన్ని దశాబ్దాల వెనక్కు తీసుకెళ్తున్నాయి. 'నిజమైన' టాన్స్ వ్యక్తులను, 'మోసపూరిత' ట్రాన్స్ వ్యక్తుల నుంచి, సుప్రీంకోర్టు గతంలో వద్దన్న పరీక్షల ద్వారా, వేరు చేసే అధికారం ఈ మెడికల్ బోర్డులకు ఇచ్చింది. ఒక దశాబ్దానికి పైగా పోరాడుతున్న ట్రాన్స్ మగవాళ్ల ఉనికినే గుర్తించలేదు. ఆడ, మగ అస్తిత్వాల్లో ఇమడని వాళ్ళనూ గుర్తించలేదు. అసలు మేమే మీ జెండర్‌ను నిర్ణయిస్తామంటోంది. ట్రాన్స్ వ్యక్తులను కుటుంబం హింసించినా సరే, అక్కడే ఉండాలని, బయటికొచ్చి వేరే ట్రాన్స్ సమూహాల సహాయం తీసుకుంటే, అలా సహాయం చేసిన వారికి కఠిన శిక్ష వేసే ప్రకరణను పెట్టింది. ఈ శిక్షలు ట్రాన్స్ వ్యక్తులపై లైంగిక దాడి చేస్తే వేసే రెండేళ్లకంటే చాలా ఎక్కువ. 19వ శతాబ్దపు వలస చట్టాల లాగా ట్రాన్స్ ప్రజల ఉనికినే నేరమయం చేసే చట్టమిది.ట్రాన్స్ ప్రజలు పెద్దగా ప్రభుత్వ సంక్షేమంపై ఆధారపడి బ్రతకట్లేదు. 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వార్షిక బడ్జెట్‌లో అయిదు నుంచి పది శాతం మాత్రమే ఖర్చు చేసిందని పార్లమెంట్ సభ్యులు క్రిందటి వారం చర్చలో ఎత్తి చూపారు. చదువున్నా ఉద్యోగాలు, పనుల్లోకి రానివ్వరు కాబట్టి అనేకమందికి భిక్షాటనపై, సెక్స్ వర్క్‌పై ఆధారపడక తప్పట్లేదు. అయితే, 2014 తీర్పు తర్వాత వచ్చిన చిన్న వెసులుబాటుతో కొంతమంది ఉద్యోగాల్లోకి ప్రవేశించారు. తెలంగాణలో మెట్రోలోనూ, ట్రాఫిక్ కానిస్టేబుళ్లుగానూ ఉన్నారు. కొంతమంది సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు.

ట్రాన్స్ మహిళలు, ట్రాన్స్ పురుషులు తమ కంటూ కొన్ని సంస్థలు ఏర్పాటు చేసుకున్నారు. ముందు తరాల వాళ్ళు, యువతరం వారిని చదువు పూర్తి చేసుకొమ్మని చెబుతున్నారు. గ్రేస్ బానో ప్రచురణ సంస్థ ప్రారంభిస్తే, తమిళనాడులో నర్తకి నటరాజ్ పద్మశ్రీ పొందారు. ట్రాన్స్ కళాకారిణి రేవతిని ప్రభుత్వమే పిల్లల స్కూళ్లల్లో జెండర్ గురించి చైతన్యపరచమని అడిగింది.

గత పదేళ్లలో కార్పొరేట్ సంస్థల్లో కొంత కదలిక వచ్చింది. ట్రాన్స్ జెండర్ కార్డు ద్వారా గుర్తింపు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొంత వైద్య సహాయం లభిస్తోంది. కొందరయినా సరే, ట్రాన్స్ వ్యక్తుల తల్లిదండ్రులు, స్వీకర్, క్వియర్ బంధు వంటి సంస్థల్లో సభ్యులై, ఒకరి నుంచి ఒకరు నేర్చుకుని, తమ పిల్లలకు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వాధికారులతో పని చేసి, ఇతరులను కూడా చైతన్యపరుస్తున్నారు. కిరణ్ నాయక్ వంటి ట్రాన్స్ పురుష ఉద్యమకారులు ఇతర సామాజిక సంస్థలు, ఉద్యమకారులకు ట్రాన్స్ ప్రజల సమస్యలను అర్థం చేయించటమే కాకుండా, అనేక ఇతర సమస్యలపై కలిసి పనిచేస్తున్నారు.

2014 తీర్పు, 2019 చట్టం ఇచ్చిన అతి చిన్న వెసులుబాట్లతోనే ఇంత ప్రగతిని సాధించిన ట్రాన్స్ ప్రజలను 2026లో చేసిన దుర్మార్గమైన సవరణలతో మళ్ళా వెనక్కి నెట్టటం న్యాయమేనా?!

## మీ సమస్య మా బాధ్యత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**రాజాపేట ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :-** రాజపేట మండల కేంద్రంలోని ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర తెలంగాణ రాజ్యాధికారం పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడుతూ భూమికోసం, భూ విముక్తి కోసం, భూ పోరాటం కోసం రాజపేట మండలం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట అని, ఈ ప్రాంతంలో అనేకమంది ఉద్యమకారులు తెలంగాణ సాయుధ పోరాట నుండి ఏలిన రాజపేట చింతలపూరి, రామ్ రెడ్డి పాశం రామ్ రెడ్డి, రజాకార్లన్ని ఎదిరించిన గడ్డ, రాజుల కోట పాలించిన ప్రాంతం ఇది, అటువంటి రాజపేట మండలం ఇప్పటికీ మండలంగా నేటికీ మండల కేంద్రంగా 60 సంవత్సరాలైన కూడా అభివృద్ధికి నోచుకోక వెనుకబడి పోతుంది విద్యా విధానంలో ప్రభుత్వ కాలేజీ లేదు , డిగ్రీ కాలేజ్ లేదు, బస్టాండ్ లేదు, స్థానికంగా రోడ్లు సరిగా లేవు బ్రిడ్జిలు లేవు కుర్రారం గ్రామం దగ్గర గత మూడు సంవత్సరాల క్రితం, దోసల వాగు దగ్గర ఇద్దరమ్మాయిలు కొట్టుకపోయారు, కానీ చీమకు కొట్టినట్టు గా ఉన్నది ప్రభుత్వం, బ్రిడ్జిలు శంకుస్థాపన చేస్తున్నారు. తప్ప వేగవంతంగా పనులు అవుతలేవు అని అన్నారు. ఇక్కడ ప్రధాన సమస్యలు వాగులు, వంకలు వస్తే ప్రజలు అనేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాగులపై బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు కార్యక్రమంలో దారిద్రరేఖ దిగవ ఉన్న ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే అన్ని మౌలిక సదుపాయాలు వచ్చేటట్టు అధికారులు ఏర్పాటు చేయాలని అన్నారు. అందులో భాగంగా ఉచిత కుట్టుమిషిని కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న శ్రీ శక్తి పథకంపై మహిళా నాయకురాలు టైలర్ మాస్టారు, పాండవుల నవనీత నరేందర్ గౌడ్ తీన్మార్ మల్లన్నకు చదువుకున్న యువతులు చాలామంది ఉన్నారు అని, వారికి ఉచితంగా కుట్టు మిషన్ నేర్పిస్తున్నాము మాకు మిషిన్లు కావాలని తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేశారు, అందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తప్పకుండా ఐదు మిషిన్లు మంజూరు చేస్తానని పాండవుల నవనీత గౌడ్ కుహామీ ఇచ్చారు, అందుకు హర్ష వ్యక్తం చేశారు. సభలో అందరూ తీన్మార్ మల్లన్న కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో రాజపేట సర్పంచ్ కోయ మధు, ఉప సర్పంచ్ నమిల కేదార్ గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ రాజపేట పాల సంఘం చైర్మన్ సందుల, భాస్కర్ గౌడ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత పార్టీ టిఆర్ఎస్ అవుతుందా?

### పాతపార్టీతో కొత్తగా వస్తామనడంలో ఆంతర్యం రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఈ విషయమై చర్చ

తెలంగాణ రాజకీయాల్లో కవిత తెలవిగా అడుగులు వేస్తున్నట్లుగా ఉంది. టిఆర్ఎస్ పార్టీని పునరుద్దరించుకోవడం ద్వారా రాజకీయంగా సులువుగా ప్రజల్లోకి వెళ్లడానికి మార్గం సుగమం చేసుకుంటున్నారని ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. కెసిఆర్ వదులుకున్న టిఆర్ఎస్‌నే సొంతం చేసుకుని తెలంగాణ శక్తిగా ఎదగాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దానిని ఎవరైనా వాడుకోవచ్చునని చెప్పారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందన్నారు. పార్టీ ఆవిర్భావం రోజు.. అమరవీరుల స్తూపం వద్దకు వెళ్తామని పేర్కొన్నారు. తాను స్థాపించ బోయే పార్టీకి పాత పేరు.. కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించారు. అలాగే టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉందని కూడా అన్నారు. దీనిని బట్టి కవతి పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి అవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. ఇకపోతే తమకు ప్రధాన శత్రువు అధికార కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో కల్వకుంట్ల కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ పార్టీ ప్రొ. జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే నడుస్తుందన్నారు. తమ పార్టీకి బిహార్ సిద్దాంతకర్త ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని పేర్కొన్నారు. గుంపు మేస్త్రీ గుంట నక్కలు దోస్తులంటూ సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై కవిత పరోక్ష విమర్శలు చేశారు. సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గం మహిళా రిజర్వేషన్‌గా చేస్తే.. ఆ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగుతానన్నారు. గజ్వేల్ మహిళా రిజర్వేషన్ వచ్చినా పోటీ చేసే అంశాన్ని ఆలోచిస్తానని తెలిపారు. సీఎం రేవంత్.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసి ఆ పార్టీని ఓడించారని.. అలాగే ప్రస్తుతం కేరళలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తారని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అంటున్నారని.. కానీ అసలు సిటీని చంపకుంటే చాలని కవిత చరకలంటించారు. మొత్తంగా కవిత రాజకీయ పార్టీ బహుశా టిఆర్ఎస్ అవుతుందని భావించాలి. అయితే ఈ పార్టీని పొందడం అంత సులువేనా అన్నది ముమ్ముందు చూడాలి. ఈ నెల 26న పార్టీ పేరును, ఎజెండాను ప్రకటిస్తామని కవిత ఇప్పటికే తెలిపారు. ఒకవేళ టిఆర్ఎస్ పేరు దక్కితే బిఆర్ఎస్ ఉనికికి ప్రమాదం ఏర్పడినట్లే.

## జిహెచ్ఎంసికి భారీగా పెరిగిన ఆదాయం

### నిర్మాణ అనుమతులతో రూ.1,172.08 కోట్ల రాబడి

నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా జీహెచ్ఎంసీకి ఆదాయం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం వచ్చినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. మొత్తం 2,427 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. కేవలం 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. మరోవైపు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ. 1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం పెరిగింది. బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసింది. మరోవైపు క్యూర్ అర్బన్ రీజియన్‌లో రూ.2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. జీహెచ్ఎంసీలో రూ.995.82 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.1000.36 కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.562.62 కోట్ల మేర వసూలైంది. మార్చి నెలలో మొత్తం రూ.453.98 కోట్ల మేర పన్ను వసూలు కాగా.. 31న ఒక్క రోజే రూ.162.94 కోట్ల ఆస్తిపన్ను బకాయిలు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు.

## అమరావతికి ప్రత్యేక పిన్‌కోడ్

### తపాలాశాఖ సమాచారం

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకంతో ఈ బిల్లు.. ఒకటి రెండు రోజుల్లో గెజిట్‌గా మారనుంది. ఈ క్రమంలో అమరావతి నూతన రాజధానికి త్వరలోనే సరికొత్త పిన్ కోడ్ ను తపాలా శాఖ విడుదల చేయనుంది. దీంతో ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతిగా భారత తపాలా శాఖ ద్వారా అధికారికంగా గుర్తింపు లభించనుంది. రాజధాని ప్రాంతంలో జనరల్ పోస్ట్ ఆఫీస్ నిర్మాణానికి ఇప్పటికే భూమిని సేకరించినట్లు వెల్లడించింది. ఈ జీపీఓ నిర్మాణం పూర్తయిన వెంటనే సర్కిల్ కార్యాలయ అనుమతితో కొత్త పిన్ కోడ్‌ను కేటాయించనున్నట్లు తెలిపింది. ఆధార్, పాస్‌పోర్ట్ సేవలతో పాటూ ప్రత్యేక పిన్ కోడ్ కోసం సూచనలను తాము పరిగణనలోకి తీసుకుంటామని పోస్టల్ శాఖ స్పష్టం చేసింది. అంతవరకు ప్రస్తుతం ఉన్న సబ్-ఆఫీసుల ద్వారా ఈ సేవలు కొనసాగుతాయని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు - 2026 నేపథ్యంలో రైతుల సంక్షేమం, పాలనా సౌలభ్యం కోసం సాగించిన ఈ పోరాటంలో ఇది కీలక అడుగు అని వెల్లడించారు.

## అమరావతిపై వైసీపీకి స్పష్టత లేదు

### మాజీ ఎంపి విజయసాయి విమర్శలు

రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టత కానీ.. స్థిరమైన విధానం కానీ లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. గురువారం రాజ్యసభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందే సమయంలో వైసీపీ ఎంపీలు వ్యవహరించిన తీరుపై విజయసాయిరెడ్డి తీవ్ర అసహనం

వ్యక్తం చేశారు. ఆ సమయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ నోరు పారేసుకుంటే.. వైసీపీ ఎంపీలు మౌనం వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ ఆ విధంగా మాట్లాడితే.. మీకు చీమకుట్టినట్లు అయినా అనిపించ లేదా అంటూ వైసీపీ ఎంపీలను ఆయన సూటిగా ప్రశ్నించారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీలు మౌన ప్రేక్షకులయ్యారా? అని విజయసాయిరెడ్డి సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలను కనీసం ఖండించరా? అని వైసీపీ ఎంపీలకు విజయసాయిరెడ్డి చురకలంటించారు. ఞాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో.. గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో అమరావతి విషయంలో వైఎస్ జగన్ వ్యవహరించిన తీరుపై పలువురు ఎంపీలు విమర్శించారు. ఈ వ్యాఖ్యలను రాజ్యసభలోని వైసీపీ సభ్యులు ఎందుకు ఖండించ లేదంటూ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పై విధంగా స్పందించారు.

## ఢిల్లీని వణికించిన భూప్రకంపనలు...

### పరుగులు తీసిన జనం

దేశ రాజధాని ఢిల్లీతో పాటు, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నాడు భూమి కంపించింది. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు వార్తలు రాలేదు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌తో పాటు ఉత్తరప్రదేశ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇళ్లలోని ఫ్యాన్లు, ఇతర వస్తువులు ఊగిపోయాయని స్థానికులు తెలిపారు. ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా భవనాలను ఖాళీ చేసి, సమీపంలోని ఖాళీ ప్రదేశాలకు చేరుకున్నారు. చాలామంది తమ అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నారు. భూకంప కేంద్రం ఎక్కడ ఉంది, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత ఎంత నమోదైందనే వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అత్యవసర సేవల బృందాలను అప్రమత్తం చేసినప్పటికీ, ఎలాంటి సహాయక కాల్స్ అందలేదని తెలిసింది. అటు, జమ్ముకశ్మీర్ ప్రాంతంలోనూ ప్రకంపనలు వచ్చినట్టు తెలుస్తోంది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైనట్టు సమాచారం. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం భూకంపాల పరంగా అత్యంత ప్రమాదకరమైన 'సిస్మిక్ జోన్ 4' పరిధిలోకి వస్తుంది. ఈ కారణంగా ఇక్కడ స్వల్ప ప్రకంపనలు కూడా విస్తృత ప్రాంతంలో ప్రభావం చూపుతాయి. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని అధికారులు సూచించారు. తదుపరి ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇన్ఫోసిస్ పేరుతో రూ.6.3 కోట్లు దోచుకున్న ఘరానా మోసగాళ్లు



ప్రముఖ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ కు చెందిన సీఎస్ఆర్ అధికారులుగా నమ్మబలికి, మర్కంటైల్ అనే కంపెనీ నుంచి రూ.6.3 కోట్లు దోచుకున్న సంఘటన మైసూర్‌లో వెలుగు చూసింది. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదుతో మైసూరు సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు గగన్, నీలాద్రి, ప్రసాద్ మిశ్రా, జె. హర్ష అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కంపెనీ ప్రతినిధులకు గగన్ మొదట ఫోన్ చేసి ఇన్ఫోసిస్ ప్రాంతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యతల విభాగం అధికారిని అని పరిచయం చేసుకున్నాడు. మర్కంటైల్ కంపెనీ నిర్వహిస్తున్న 'హెగ్గుంజే రాజీవ్ శెట్టి ఛారిటబుల్ ట్రస్ట్'కు కోట్లాది రూపాయల నిధులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. మంగళూరు, ఉడిపిలలో ఆ కంపెనీ నిర్వహిస్తున్న ట్రస్టు కార్యకలాపాలను పరిశీలిస్తామని చెప్పాడు. నిపుణుల పేరుతో కొంతమంది అనుచరులను పంపించాడు. ట్రస్టులకు నిధులు ఇస్తామని, అయితే అంతకుముందు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించాడు. దశలవారీగా వివిధ రూపాల్లో రూ.6.3 కోట్లు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత మర్కంటైల్ కంపెనీ నిర్వహిస్తున్న ట్రస్టులు, ఆరోగ్య కేంద్రాలకు రూ.178 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు గత సంవత్సరం అక్టోబర్‌లో ఒక పత్రాన్ని సృష్టించారు. దానిని నిజమని నమ్మిన మర్కంటైల్ ప్రతినిధులు నగదు ఇచ్చారు. అయితే నెలలు గడిచినా నిధులు సంస్థ ఖాతాల్లోకి రాకపోవడంతో మోసపోయామని గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కవలలను బావిలోకి తోసి చంపేసిన కర్కశుడు

కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. కన్న కూతుళ్లను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రి.. కర్కశుడిగా మారాడు. తన ఇద్దరు కవల పిల్లల్ని బావిలో తోసేసి హతమార్చాడు. తొలుత వారిని బావిలోకి నెట్టేసిన శ్రీశైలం.. తానూ దూకేశాడు. అయితే, ఈత రావడంతో సురక్షితంగా బయటకు వచ్చేశాడు. సమాచారం అందుకున్న స్థానికులు బావిలో వెతకగా.. ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఆగ్రహించిన గ్రామస్థులు తండ్రికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు.

## జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ క్రమబద్దీకరణ

నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు కీలక సూచన చేశారు. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ చేపట్టిన స్టీల్ ఫ్లై ఓల్గ÷వర్, అండర్‌పాస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ నియమాల్లో తాత్కాలిక మార్పులు చేయడం జరుగుతోందని హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డెవిస్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు (మొత్తం 3 గంటల పాటు) కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ - వే ట్రాఫిక్ నిబంధనలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. భవిష్యత్‌లో శాశ్వతంగా అమలు చేయబోయే ట్రాఫిక్ మళ్లింపులపై పట్టు సాధించేందుకే ఈ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పంజాగుట్ట నుండి వచ్చే వాహనాలు మాదాపూర్‌కు వెళ్లేందుకు గాను రోడ్ నెంబర్-2 లో డైవర్షన్ తీసుకోవాలి. అటు నుంచి ఇందిరానగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-5, రోడ్ నెంబర్-10 మీదుగా రోడ్ నెంబర్-45 కు చేరుకని మాదాపూర్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. మాదాపూర్ రోడ్ నెంబర్-45 నుంచి పంజాగుట్ట వైపు వచ్చే వాహనాలను జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్క్ ముందు నుంచి వన్ వేలో భాగంగా రోడ్డు నెంబర్-2 వైపునకు మళ్లించనున్నారు. రోడ్ నెంబర్ -10, 12 నుండి వచ్చే వాహనాలన్నీ అగ్రసేన్ మహారాజ్ జంక్షన్ నుంచి జర్నలిస్ట్ కాలనీ, బాలకృష్ణ ఇంటి ముందు నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్కు చేరుకునే విధంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. హైదరాబాద్ ప్రజలందరికీ హైదరాబాద్ ట్రాఫిక్

అడ్వైజరీలో భాగంగా తెలియజేస్తున్న సూచనలను పాటించి ప్రజలంతా సహకరించాలి కోరారు.

# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా ?

పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷-ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్చిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది.

ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా- ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా- ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

## కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

### డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్
### పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మీనా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్-అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్-అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్-అహ్మదీ ర్గి÷నైరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా
## భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్టైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## కిరాయి హంతకుల అవతారం ఎత్తిన అమెరికా మాజీ సైనికులు...
## యూఏఈ కోసం యెమెన్‌లో హత్యలు!



అమెరికాకు చెందిన మాజీ సైనికులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కోసం ఒక రహస్య బృందంగా ఏర్పడి అనేక హత్యలు చేశారంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యెమెన్‌లోని రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని ఈ హత్యలు జరిపినట్లు అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) తన కథనంలో వెల్లడించింది. ఈ వ్యవహారంపై యెమెన్‌కు చెందిన ఓ రాజకీయ నాయకుడు అమెరికా కోర్టులో దావా వేయడంతో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే, అమెరికా మాజీ సైనికులైన అబ్రహాం గోలన్, ఐజాక్ గిల్‌మోర్ కలిసి శాన్ డియాగోలో 'స్పియర్ ఆపరేషన్స్ గ్రూప్' అనే ప్రైవేట్ మిలిటరీ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా యూఏఈతో ఒప్పందం కుదుర్చుకుని, యెమెన్‌లో లక్షిత హత్యలకు (టార్గెటెడ్ అసాసినేషన్స్) పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, స్పియర్ ఆపరేషన్స్ సంస్థకు నెలకు 15 లక్షల డాలర్లు (సుమారు రూ. 12.5 కోట్లు), విజయవంతమైన ప్రతీ హత్యకు అదనపు బోనస్‌లు అందేవని కోర్టు పత్రాల్లో పేర్కొన్నారు. యెమెన్‌కు చెందిన చట్టసభ సభ్యుడు, అల్-ఇస్లాహ్ పార్టీ నేత అన్‌సాఫ్ అలీ మాయో ఈ దావా వేశారు. 2015లో తనను హత్య చేయడానికి యూఏఈ ప్రభుత్వం అబ్రహాం గోలన్‌ను నియమించిందని ఆయన ఆరోపించారు. 2015 డిసెంబర్ 29న, అడెన్ నగరంలోని తన కార్యాలయంపై స్పియర్ ఆపరేషన్స్ బృందం బాంబు దాడికి పాల్పడిందని, తాను కొద్ది నిమిషాల ముందే అక్కడి నుంచి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డానని మాయో తెలిపారు. "పదేళ్ల క్రితం వారు నన్ను చంపడానికి ప్రయత్నించారు. నేను బతికినా, నా కుటుంబాన్ని వదిలి దేశాంతర జీవితం గడుపుతున్నాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తర్వాత భయంతో సౌదీ అరేబియాకు వలస వెళ్లినట్లు పేర్కొన్నారు. 2015లో ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను ఆక్రమించుకున్న నేపథ్యంలో, యూఏఈ సౌదీ నేతృత్వంలోని కూటమిలో చేరి సైనిక చర్యలు చేపట్టింది. ఈ సమయంలోనే అల్-ఇస్లాహ్ పార్టీ నేతలను యూఏఈ లక్ష్యంగా చేసుకుంది. అయితే, అల్-ఇస్లాహ్ ఒక చట్టబద్ధమైన రాజకీయ పార్టీ అని, కేవలం యూఏఈ విధానాలను విమర్శించినందుకే వారిని టార్గెట్ చేశారని నిపుణులు అంటున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ, 2018లో బజ్‌ఫీడ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్రహాం గోలన్ స్వయంగా ఈ హత్యల కార్యక్రమం గురించి మాట్లాడారు. "యెమెన్‌లో టార్గెటెడ్ అసాసినేషన్ ప్రోగ్రామ్ ఉంది. దాన్ని నేనే నడిపాను. యూఏఈ కూటమి ఆమోదంతోనే మేము ఇది చేశాం" అని ఆయన అంగీకరించారు. అయితే, యూఏఈ అధికారులు మాత్రం ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు మాత్రమే మద్దతిచ్చామని, రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకోలేదని వాదిస్తున్నారు. అమెరికా చట్టంలోని 'అలియన్ టార్ట్ స్టాట్యూట్' కింద మాయో ఈ దావా వేశారు. గోలన్, గిల్‌మోర్ తదితరులపై యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. ఈ కేసు, విదేశాల్లో అమెరికా మాజీ సైనికులు ప్రైవేట్ మిలిటరీ కాంట్రాక్టర్లుగా చేసే చట్టవ్యతిరేక చర్యలపై, వారిని జవాబుదారీగా నిలపాల్సిన అమెరికా ప్రభుత్వ బాధ్యతపై తీవ్ర చర్చకు దారితీసింది.

## కరీంనగర్‌లో దారుణం.. ఐదేళ్ల పిల్లలను
## బావిలోకి తోసి చంపేసిన కసాయి తండ్రి

కరీంనగర్‌లో దారుణం జరిగింది. కసాయి తండ్రి కన్నబిడ్డలను బావిలోకి తోసేసి చంపేశాడు. ఈ విషాద ఘటన కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్‌లో జరిగింది. భార్యతో గొడవపడిన శ్రీశైలం అనే వ్యక్తి ఐదు సంవత్సరాల కవల పిల్లలను బావిలోకి తోసేశాడు. ఆ తర్వాత బావిలోకి దూకి అతను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. కానీ ఈత రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. శ్రీశైలం చిన్నారులకు మొదట గడ్డిమందు తాగించి, ఆ తర్వాత బావిలోకి తోసేశాడు. స్థానికులు బావిలో వెతకగా ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. స్థానికులు ఆగ్రహంతో శ్రీశైలంను చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ కలహాలు ఈ ఘటనకు కారణమని పోలీసులుప్రాథమికంగా నిర్ధారించారు.

## నాలాలను కబ్జా చేస్తే కూల్చివేస్తాం

నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మా ణాలు చేస్తే కూల్చివేస్తామని మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. శుక్రవారం 35వ డివిజన్‌లో వార్డు బాటలో పాల్గొన్నారు. అక్రమంగా ప్రధా న కాలువ పక్కన నిర్మించిన కట్టడాలను సిబ్బంది తొలగించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం నగరపాలక సంస్థలో నాలాల పూడికతీత నిరంతరం కొనసాగుతుందని, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవన్నారు. బఫర్ జోన్‌లో శానిటేషన్ ట్రాక్టర్ వెళ్లడానికి వీలుగా సీసీ రోడ్డును నిర్మిస్తామని, ప్రస్తుతం నగర పాలక సంస్థపై ఆర్థిక భారం పడకుండా మున్సిపల్ సిబ్బందిపై పనులు చేయిస్తున్నామన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని కోరారు. ఐబీ కాలనీలో పేరుకుపోయిన చెత్తను నీటి సరఫరా కోసం తవ్విన గుంతలతో ప్రమాదాలు జరుగకుండా మూసివేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ గడ్డం రమాదేవి శ్రీనివాస్, కంక ణాల మౌనిక రాజు, వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, దూళికట్ట సతీష్; నాయకులు పీచర శ్రీనివాస్, వేగోళపు శ్రీనివాస్, డీఈ షాబాజ్, ఏఈ మీర్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ పేరు తీసేస్తే సహించం.

### నరేగాపై దాడి ఆపాలంటూ సంతకాల సేకరణ.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరు మార్చి విబి జి రాంజీ గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ అ సంఘటిత కార్మికుల(కెకెసి) కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు, అసంఘటిత కార్మికుల కమిటీ జాతీయ చైర్మన్ ఉదిత్ రాజ్, తెలంగాణ చైర్మన్ కౌశల్ సమీర్ సూచనల మేరకు నరేగా బచావో వివిబిజిబిరాంబిజీ హఠావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలో కెకెసి రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.రాజశేఖర్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీల హక్కులపై దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. కూలీల పొట్టకొట్టి కాంట్రాక్టర్లకు లాభాలు ఇవ్వడం అమానుషమని, నరేగాను బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకుంటామని తెలిపారు. గాంధీ పేరు తీసేయడం దేశ చరిత్రను అవమానించడమేనన్నారు. పేదల హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెకెసి మైనార్టీ రాష్ట్ర నాయకులు మున్న జానీ, జిలాని, కేసముద్రం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ ఖాన్, కల్వల గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, స్థానిక నాయకులు గండి శ్రీనివాస్, ఆకుల సుధాకర్, జయిందర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, శేఖర్ రెడ్డి, బొడ్డు బిక్షం, ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## ఎల్పీజీ సరఫరా స్థిరంగా, పూర్తి అందుబాటులో ఉంది: ఐఓసీ

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ (ఌా+) సరఫరాకు కలుగుతున్న అంతరాయంపై ఆందోళనల నేపథ్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఞాజ) శుక్రవారంనాడు కీలక వివరణ ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరా స్థిరంగా, పూర్తి అందుబాటులో ఉందని ప్రకటించింది. వినియోగదారులు ప్యానిక్ బుకింగ్‌కు, అక్రమ నిల్వలకు పాల్పడవద్దని కోరింది.

ప్రస్తుత ఉద్రిక్తతలకు ముందు సరఫరా చేసినట్టు ప్రతిరోజూ సుమారు 28 లక్షల ఎల్పీజీ సిలెండర్లను డెలివరీ చేస్తున్నామని, గృహావసరాలకు సిలెండర్ల సరఫరా నిరంతరాయంగా జరుగుతోందని ఐఓసీ తెలిపింది. 87 శాతం రీఫిల్ బుకింగ్‌లు డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారానే జరుగుతున్నాయని, ఓటీపీ-బేస్డ్ సిస్టమ్స్ ద్వారానే కస్టమర్లకు సిలెండర్లు రీచ్ అవుతున్నాయని పేర్కొంది. ప్రస్తుత పరిణామాలు గ్లోబల్ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపిస్తున్నాయని, అయితే ఇండియాలో మాత్రం ఎల్పీజీ సరఫరా నిలకడగా ఉందని ఐఓసీ తెలిపింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, గృహావసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పింది. ఎల్పీజీ రీఫిల్స్ బుకింగ్ కోసం ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ వంటి డిజిటల్ మోడ్స్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని తెలిపింది. అవకతవకలకు పాల్పడుతున్న 141 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లపై చర్చలు తీసుకున్నామని, ఐదుగురిని సస్పెండ్ చేశామని వివరించింది.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతుల ఇబ్బందులు.

### కౌంటర్లు పెంచాలని సిపిఎం మండల కార్యదర్శి గొడిషాల వెంకన్న డిమాండ్

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ధన్నసరి సొసైటీ ద్వారా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో ఒకే ఒక్క కౌంటర్ ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న ఆరోపించారు. శుక్రవారం కేసముద్రం మార్కెట్ లోని రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద మాట్లాడుతూ మొక్కజొన్న విక్రయానికి రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, కాంటా అయిన తర్వాత వివరాలు నమోదు చేయించడం వంటి అన్ని ప్రక్రియలకు ఒకే కౌంటర్ ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. ఆరుగాలం చేన్లలో కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులను ఇక్కడ కూడా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. అలాగే మొక్కజొన్న కొనుగోళ్లలో ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీసం ఎకరానికి 40 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు క్వింటాకు రూ.330 బోనస్ ఇవ్వాలని కోరారు. కొనుగోలు కేంద్రంలో కనీసం మూడు నుంచి నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుల రద్దీ తగ్గించాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసి సమయాన్ని ఆదా చేయాలని సూచించారు.



రైతులు ఎక్కువసేపు నిలబడకుండా టోకెన్ విధానం అమలు చేయాలని తెలిపారు. మార్కెట్ యార్డులో తాగునీరు, నీడ, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతుల పంటను తక్షణమే తూకం వేసి ఆలస్యం లేకుండా చెల్లింపులు చేయాలన్నారు. అధికారులు రైతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com